J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12




THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 45 సంచిక : 10 8.8.2025, శుక్రవారం వెల : రూ. 10/- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

• మంత్రివర్గం

# విస్తరణవైపు విధేయుల చూపు



- కేబినెట్ బెర్త్ కోసం ఆశావహుల కసరత్తు
- అధిష్టానాన్ని ప్రసన్నం చేసుకునే పనిలో టీడీపీ నేతలు
- జనసేన, బీజేపీ ఎమ్మెల్యేలలోనూ ఆశలు
- ప్రస్తుత మంత్రుల్లో కొందరి స్థానం గల్లంతే?

**కూటమి ప్రభుత్వం ఏడాదిపాలనను దిగ్విజయంగా పూర్తిచేసుకుని 'సుపరిపాలనకు తొలి అడుగు' అంటూ ప్రజల్లోకి దూసుకెళ్తోంది. ఈ క్రమంలో లోటుపాట్లను సరిదిద్దుకుని మరింత సమర్థవంతంగా పాలనను పరుగులు పెట్టించాలని చంద్రబాబు తలపోస్తున్నారు. ఇందులో భాగంగా ఆయన తొలుత మంత్రివర్గంలో మార్పులు చేర్పులు చేపట్టి సత్తా ఉన్న ఎమ్మెల్యేలకు అమాత్యయోగం కలిగించాలని యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఈమేరకు కేబినెట్ విస్తరణ చేపట్టే విషయంపై ముమ్మరంగా కసరత్తు చేస్తున్నట్లు రాజకీయవర్గాల భోగట్టా. దీంతో తమ అధినేతను ఎలాగైనా మెప్పించి కేబినెట్ బెర్త్‌ను ఖరారు చేసుకోవాలని పలువురు టీడీపీ ఎమ్మెల్యేలు ఉవ్విళ్లూరుతున్నారు. ఇందుకోసం వారు అన్ని రకాల ఉపాయాలతో పాటు, పనితీరుతో అధిష్టానాన్ని మెప్పించి, ఒప్పించి తమను ఎలాగైనా గుర్తించేలా చేసుకోవాలని తపనపడుతున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఎవరికి మంత్రివర్గంలో చోటు దక్కే అవకాశం ఉంది, ఎవరికి రిక్తహస్తాలు మిగులుతాయన్నది ఆసక్తికరంగా మారింది.**

## కొందరు మంత్రులపై అధినేత అసంతృప్తి..

ముచ్చటగా మూడు పార్టీల కలయికతో ఏర్పాటైన కూటమి ప్రభుత్వంలో ప్రస్తుతం చంద్రబాబు సహా 25 మంది మంత్రులు ఉన్నారు. నిబంధనల ప్రకారం మరో బెర్త్ ఖాళీగా ఉంది. రాష్ట్రం మంత్రివర్గ పునఃవ్యవస్థీకణ జరిగితే దీన్ని కూడా భర్తీ చేయడం ఖాయం. అయితే ప్రస్తుతం ఉన్న మంత్రుల్లో కొందరిపై సీఎం చంద్రబాబు అసంతృప్తితో ఉన్నారు. ఈ విషయాన్ని ఆయన కేబినెట్ సమావేశాల్లో పలుమార్లు బహిరంగంగానే ప్రకటించారు కూడా. పనితీరులో దూకుడు, వైఎస్సార్‌సీపీ కుట్రరాజకీయలకు సమర్థంగా కౌంటర్ ఇవ్వడం, శాఖలపై పట్టుపెంచుకోవడం, జిల్లాలోని మిగిలిన ఎమ్మెల్యేలతో సఖ్యతగా ఉండడం, నిరంతరం ప్రజల్లో ఉంటూ ప్రభుత్వ విజయాలను, పథకాలను ప్రజలకు వివరించడం, ఇంటర్నల్‌గా పనితీరుని ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ తమదైన శైలిలో రాణించాలని ఆయన తన మంత్రివర్గ సహచరులకు ఎన్నోసార్లు హితోపదేశం చేశారు. అయితే, కొందరు మంత్రులు తమకెందులే అన్నట్లు ఉదాసీనంగా వ్యవహరించడం ఆయన ఆగ్రహానికి కారణంగా తెలుస్తోంది. చివరికి మహిళా ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిపై వైఎస్సార్‌సీపీ నేత నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి ఇష్టానుసారంగా నోరు పారేసుకున్నా, కొందరు అమాత్యులు నోరుమెదపక పోవడంతో కేబినెట్ ప్రక్షాళన చేపట్టి తీరాల్సిందే, అనే గట్టి నిర్ణయానికి చంద్రబాబు వచ్చినట్లు సమాచారం. అలాగే ప్రతి మంత్రికి ఓ సోషల్ మీడియా గ్రూప్‌ను, పీఆర్‌ఓలను కేటాయించినా, తమ శాఖల్లో జరిగే మంచిని ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేయడంలో కొందరు విఫలమైనట్లు ఆయన భావిస్తున్నారు. దీంతో కేబినెట్‌ను విస్తరించడంతో పాటు ఇప్పుడున్న వారిలో కొందరిని తప్పించి, మరి కొందరి శాఖల్లో మార్పులు చేసి, ఉదాసీనంగా ఉంటే ఊరుకునేది లేదనే గట్టి సంకేతాన్ని పంపించాలని తలపోస్తున్నట్లు విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

## అమాత్య రేసులో భారీగా ఆశావహులు

రికార్డు స్థాయిలో కూటమి ప్రభుత్వానికి 164 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. వీరిలో ప్రస్తుతం 25 మంది మంత్రులుగా ఉన్నారు. ఇందులో 18 మంది మొదటిసారి మంత్రులైన వారే ఉన్నారు. ఈ నేపథ్యంలో మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణపై చాలామంది ఆశావహులు గంపెడాశలు పెంచుకుంటున్నారు. వీరిలో ఉత్తరాంధ్ర నుంచి గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్‌రావు, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాస్‌రావు, గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు, ఇచ్చాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్, చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకట్రావు, కోస్తా నుంచి జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య), దక్షిణ కోస్తా నుంచి కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, రాయలసీమ నుంచి మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్, కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డి టీడీపీ తరపున రేసులో ఉన్నారు.

ఇక జనసేన నుంచి సీనియర్ ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, బీజేపీ నుంచి విష్ణు కుమార్‌రాజు మంత్రి పదవి ఆశిస్తున్నారు. అలాగే ఇప్పటికే ప్రకటించినట్లు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సోదరుడు, ఎమ్మెల్సీ నాగబాబు మంత్రి కావడం ఖాయంగా కనిపిస్తోంది. కాగా, నాగబాబు, కొణతాల, విష్ణుకుమార్‌రాజు ఉత్తరాంధ్రకు చెందినవారు కావడంతో ఆ ప్రాంతం నుంచి టీడీపీ ఆశావహులకు భంగపాటు తప్పదనే ప్రచారం సాగుతోంది. ఇక దక్షిణ కోస్తాలో వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, పుట్టా సుధాకర్‌యాదవ్ బలమైన పోటీదారులుగా ఉన్నారు. వీరిలో మహిళా కోటాలో ప్రశాంతిరెడ్డికి స్థానం తథ్యమని విశ్వసనీయ వర్గాల సమాచారం.

## ఉద్వాసన వీరికేనా..?

శాఖలపై పట్టు సంపాదించుకోలేని.. ప్రతిపక్షాన్ని ధీటుగా ఎదుర్కోలేకపోతున్నారనే కారణంతో ప్రస్తుత మంత్రివర్గంలో పలువురికి ఉద్వాసన తప్పదనే ప్రచారం జోరుగా సాగుతోంది. వారిలో వాసంశెట్టి సుభాష్, కొండపల్లి శ్రీనివాసరావు, కొలుసు పార్థసారథి, మండపల్లి రాంప్రసాద్‌రెడ్డి, గొట్టిపాటి రవికుమార్, ఫరూక్ తదితరులున్నట్లు తెలుస్తోంది.

ఏదైవైనా.. తాను తొలిసారి ముఖ్యమంత్రి అయినప్పుడు ఉన్న దూకుడు ప్రతి మంత్రిలో, ఎమ్మెల్యేలో ఉండాలంటూ తరచూ పిలుపునిచ్చే ముఖ్యమంత్రి చంద్రబాబు కేబినెట్ విస్తరణలో ఇదే విషయాన్ని చెప్పకనే చెప్పనున్నట్లు కనిపిస్తోంది. అది జరిగితే పలువురు యువ ఎమ్మెల్యేలు మంత్రులు కావడం ఖాయం. వీరిలో ఇప్పటికే కొంతమందికి అధిష్టానం ఆమేరకు సంకేతాలు కూడా పంపినట్లు కూడా ప్రచారం సాగుతోంది.

ఈ క్రమంలో సెప్టెంబర్ లేదా అక్టోబర్‌లో మంత్రివర్గ విస్తరణపై సస్పెన్స్‌కు తమ ముఖ్యమంత్రి చంద్రబాబు తెరదించుతారని విధేయులు గంపెడాశలతో ఎదురు చూస్తున్నారు. తెలుగుదేశం పార్టీకి ఆగస్టు అచ్చిరాదు కాబట్టి ఈ నెలలో పార్టీ పరంగా ఎలాంటి మేజర్ నిర్ణయాలు తీసుకునే అవకాశం లేదని పార్టీశ్రేణులు అభిప్రాయం. మొత్తంమీద కూటమి నేతల్లో చాలామందే విధేయులు, ఆశావహులు బుగ్గకారు ప్రొటోకాల్ కోసం పరితపిస్తున్నారు. మరి వీరిలో ఎవరికి అధినేత కరుణ దక్కుతుందో చూడాలంటే మరి కొంత కాలం వేచిచూడాలి.!

ఘోరాతి ఘోరం.. మనుషులతో వ్యాపారం
'రాజశ్రీ' సత్యపీఠం.. 4లో

అంతులేని శోకం.. ఆపలేని ద్రోహం
పుడమితల్లికి పుత్ర గండం
'బాలుబాబు' అంతరంగం... 2లో

స్వయం సమృద్ధే.. ట్రంప్‌కి సమాధానం
'తిలక్' మనసులో మాట.. 8లో

# ముత్తుకూరులో 65 లక్షలతో..'అన్న క్యాంటీన్'



ముత్తుకూరులో అన్న క్యాంటీన్ భవన నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. మాజీమంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పూజలు చేసి ఆ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముత్తుకూరులో రూ.65 లక్షల వ్యయంతో 'అన్న క్యాంటీన్' భవన నిర్మాణ పనులు ప్రారంభించామన్నారు. అన్న క్యాంటీన్ ప్రారంభం కాగానే కేవలం రూ.5కే టిఫిన్, భోజనం అందించనున్నామని ఆయన తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో సర్వేపల్లి నియోజకవర్గంలోని ముత్తుకూరు, పొదలకూరులో అన్న క్యాంటీన్లు నిర్వహించామని, అయితే అప్పట్లో వైకాపా అధికారంలోకిరాగానే వాటిని మూయించేసిందన్నారు. మళ్ళీ కూటమి ప్రభుత్వం వచ్చాక, ఇప్పుడు మొదటి విడతలో ముత్తుకూరులో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ముత్తుకూరులో పెద్దసంఖ్యలో పరిశ్రమలున్న నేపథ్యంలో వేలాదిమంది కార్మికులు, కూలీలతో పాటు స్థానికుల ఆకలిని ఈ అన్న క్యాంటీన్ తీర్చనుందని ఆయన అన్నారు.

# క్రీడా సంఘాలకు అవార్డులు

స్వాతంత్ర్యదినోత్సవం, గణతంత్ర దినోత్సవాల్లో క్రీడాకారులకు ఇచ్చే ప్రశంసా పత్రాలతో పాటు, ఉత్తమ క్రీడా సంఘాలకు కూడా ప్రభుత్వం ప్రోత్సాహక అవార్డులను అందజేస్తుందని మాజీ రంజీ క్రీడాకారుడు, జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు మలిరెడ్డి కోటారెడ్డి చెప్పారు. ఇటీవల ఆయన నెల్లూరులోని తమ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటుచేసి మాట్లాడుతూ, క్రీడా సంఘాలు, ఉత్తమ అధ్యక్ష కార్యదర్శులకు స్వాతంత్ర్యదినోత్సం, గణతంత్ర దినోత్సవాల సందర్భంగా అవార్డులు ఇవ్వాలని తాము జిల్లా కలెక్టర్‌ను కోరామని, అందుకు ఆయన సానుకూలంగా స్పందించి, క్రీడా ప్రాధికార సంస్థకు ఉత్తర్వులిచ్చారని సంతోషం వ్యక్తం చేశారు. క్రీడాసంఘాలు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్(శ్యాప్) ద్వారా గుర్తింపు కలిగి ఉండాలని ఆయన అన్నారు.

# చిన్నతనం నుంచే నైతిక విలువలు పెంపొందించాలి

## - చెన్నై జీయర్ ట్రస్ట్ అధ్యక్షుడు రవీంద్రకుమార్‌రెడ్డి





చిన్నారుల్లో చిన్నతనం నుంచే నైతిక విలువలు పెంపొందించాలని జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ (జెట్)-చెన్నై శాఖ అధ్యక్షులు పి.రవీంద్రకుమార్‌రెడ్డి అన్నారు. ఇటీవల చెన్నై అశోక్‌నగర్‌లోని మహాలక్ష్మి పాఠశాల ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని పూజలు చేసి, చిన్నారులకు చిత్రలేఖనం తదితర పోటీలు నిర్వహించారు. చినజీయర్‌స్వామి మంగళాశాసనాలతో ఈ ట్రస్ట్ ఆధ్వర్యంలో రెండురోజుల పాటు ఈ పోటీలు జరిగాయి. బాలలు పెద్దసంఖ్యలో ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బాలల్లో ఆధ్యాత్మిక చింతనా సక్తిని కలిగించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. నేటి బాలలే రేపటి పౌరులు కనుక, వారికి పెద్దల పట్ల గౌరవం, సమాజం పట్ల బాధ్యత ఉండేలా చిన్నతనం నుంచే తీర్చిదిద్దుకోవాలని ఈ సందర్భంగా తల్లి తండ్రులకు విజ్ఞప్తి చేశారు. ఈ నెల 3న రామాయణం, విష్ణు సహస్రనామం, తదితర అంశాలపై పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో గెలిచిన విజేతలకు ఈ నెల 17న టి-నగర్‌లోని పీఆర్‌సీ సెంటినరీ హాలులో బహుమతులు పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ పోటీలకు దాతల సహకారం మరువలేనిదని, ప్రతి ఏటా ట్రస్టు ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించి విజేతలైన బాలలకు బహుమతులందజేసి ప్రోత్సహిస్తున్నామని, అందుకు సహకరిస్తున్న దాతలందరికీ ధన్యవాదాలు తెలిపారు.

# వేదగణపతికి వేడుకలు



నెల్లూరు చంద్రమౌళినగర్ కూడలిలో కొలువైవున్న శ్రీ వేదగణపతి స్వామివారి దేవస్థానంలో విశేషపూజలు, అభిషేకాలు జరుగుతున్నాయి. సింహపురి గణేష్ ఉత్సవ కమిటీ ట్రస్టు ఆధ్వర్యంలో ఈనెల 7,8 తేదీల్లో స్వామివారి దేవస్థానంలో మహాకుంభాభిషేకాలకు భారీ ఏర్పాట్లు చేశారు. 7వ తేదీ ఉదయం అఖండ దీపారాధన, గోపూజ, విశేషాభిషేకాలు, సాయంత్రం ప్రధాన కలశ స్థాపన, అనంతరం పూజలుచేసి రాత్రి 8గంటలకు హోమం నిర్వహించారు. 8వతేదీ శుక్రవారం ఉదయం 6 నుంచి పూజలు, 10.30కి మహాపూర్ణాహుతి, 11గంటలకు స్వామివారి శిఖర కుంభాభిషేకం జరుగనున్నాయి. 11.30గంటలకు వినాయకచవితి అంకురార్పణ పూజ, ఆ తర్వాత అన్నప్రసాద వితరణ నిర్వహిస్తామని ట్రస్టు నిర్వాహకులు తెలిపారు.

## అంతులేని శోకం.. ఆపలేని ద్రోహం

# పుడమితల్లికి.. పుత్ర గండం



- ప్రపంచ వ్యాప్తంగా యుద్ధాలు, ఘర్షణలు
- రక్తంతో తడిసిముద్దవుతున్న భూమాత
- మానవుడి స్వార్థం.. ధనిక దేశాల దురాశే కారణం

**అంతరంగం**

- బాలుబాబు

*తన గర్భంలో అంతులేని వేడిని, అనంత వాయువులను, శిలాజ ద్రవాన్ని ఇముడ్చుకున్న భూమాత.. పైన మాత్రం మానవుడికి అందమైన ప్రకృతిని ప్రసాదించింది. స్వచ్ఛమైన గాలి, స్వచ్ఛమైన నీటితో పాటు కల్మషంలేని జంతుజాలాన్ని అందించి మానవ జీవనాన్ని సులభతరం, సుఖవంతం చేసింది.*

*అయితే, తప్పిదాలనే జీవన విధానంగా మార్చుకున్న మానవజాతి నిరంతర కల్లోలాలు.. కక్షలు.. యుద్ధాలు, కాలుష్యకారకాలతో పుడమి తల్లికి అంతులేని శోకాన్ని మిగుల్చుతోంది. ఫలితంగా పాడైపోతున్న పర్యావరణం, కలుషితమవుతున్న జలవనరులు, నిస్సత్తువుగా మారుతున్న భూమి జీవరాశులకు తగినంత ఆహారాన్ని, ఆశ్రయాన్ని ఇవ్వలేకపోతున్నాయి. దీంతో జీవవైవిధ్యం దెబ్బతిని ఎన్నో జంతువులు, అనేక పక్షులు, పలు కీటక జాతులు కాలగర్భంలో కలిసిపోతున్నాయి. సమతౌల్యం లేక ప్రకృతి విపత్తులు విలయతాండవం చేస్తున్నాయి. ఎందరో అభాగ్యుల జీవితాలను అర్థాంతరంగా ఆర్పేస్తున్నాయి. వీటన్నింటినీ చూస్తున్న భూమాత మౌనంగా రోదిస్తూ.. కన్నీరు కారుస్తోంది. పెచ్చుమీరుతున్న ప్లాస్టిక్ భూతాన్ని ఆపలేక.. అంతకంతకూ పెరుగుతున్న ఉష్ణతాపాన్ని తట్టుకోలేక తల్లడిల్లిపోతోంది. పరస్పర దాడులు.. బాంబు పేలుళ్లతో నలిగిపోతోంది. అయినా తీరు మార్చుకోక, జాగురూకత నేర్చుకోక జనం భూమితల్లికి భరించలేనంతటి బాధను మిగులుస్తున్నారు.*

### అరణ్యరోదనే..

నేరాలు.. ఘోరాలు, ఆకలికేకలు.. నెత్తుటిధారలు.. వలసలు, బలవన్మరణాలు, యుద్ధాలు.. మారణహోమాలు ఉగ్రవాదం.. తీవ్రవాదం వెరసి అంతులేని దుఃఖంతో చాలాదేశాలు అల్లాడిపోతున్నాయి. మరికొన్ని దేశాలు కరువులు, కార్చిచ్చులు, అగ్నిపర్వత పేలుళ్లు, తుపానులు, వరదలు, భూకంపాలతో దద్దరిల్లుతున్నాయి. ఇంకొన్ని దేశాలు అతి ఉష్ణోగ్రతలు, అతిశీతల వాతావరణం, సముద్రపు కోతలతో కునారిల్లుతున్నాయి. సౌరకుటుంబంలోని గ్రహాల్లో భూమిపై మాత్రమే జీవం ఉనికి ఉందని భావిస్తున్న నేటి తరుణంలో మానవ తప్పిదాలు తీవ్రమై చివరికి ప్రకృతి విపత్తులకు కారణమై ప్రజా జీవనాన్ని అస్తవ్యస్తం చేస్తున్నాయి. ఇలాంటి తరుణంలో ప్రకృతిని రక్షించి భూమాతకు జవసత్వాలు నింపాల్సిన పాలకులు, ప్రజలు తమ స్వార్థం కోసం, స్వలాభం కోసం ప్రపంచాన్ని మరింత ప్రమాదపుటంచుల్లోకి నెడుతూ భావితరాల భవిష్యత్‌ను చిదిమేస్తున్నారు. కరోనా, హెచ్‌ఎంపీవీ (హ్యూమన్ మెటానిమో వైరస్) వంటి మహమ్మారులు, సునామీలు, టోర్నడోలు, భూకంపాలు వంటి ఉపద్రవాలతో ప్రకృతి హెచ్చరిస్తున్నా.. ముంచుకొస్తున్న ముప్పును గ్రహించలేకపోతున్నారు.

### ప్రపంచవ్యాప్తంగా ప్రమాద ఘంటికలే..

ప్రపంచంలోని ఏడు ఖండాల్లో అంటార్కిటికా ఒకటి. నిరంతరం మంచుతో కప్పబడి ఉండే ఈ ఖండ తీరాలు సైతం భూతాపం కారణంగా వేడెక్కుతున్నాయి. ఫలితంగా అక్కడ జీవించే డాల్ఫిన్లు, సీల్లు, ధ్రువపు ఎలుగుబంట్లు, మత్స్యసంపద క్రమంగా హరించుకుపోతోంది. పైగా ధ్రువాల వద్ద ఉండే మంచు సైతం భారీస్థాయిలో కరుగుతూ సముద్రమట్టాల పెరుగుదలకు కారణమవుతోంది. దీంతో ఇతర ఖండాల్లోని జనావాసాలుగా ఉన్న తీరప్రాంతాలు ముంపు సమస్యను ఎదుర్కొంటున్నాయి. తద్వారా రోజురోజుకూ భూవైశాల్యం కుంచించుకుపోతోంది. ఇక ఇతర ఖండాల్లో మానవుడి అత్యాశ, విపరీత చర్యలవల్ల ఉన్న కొద్దిపాటి సారవంతమైన భూమి సైతం విషతుల్యమవుతోంది. ముఖ్యంగా ఇటీవల కాలంలో అయితే యుద్ధాలు భూమిపై నెత్తుటేర్లు పారిస్తున్నాయి. ఓ వైపు రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ఏళ్ల తరబడి సాగుతోంది. మరోవైపు ఇజ్రాయిల్-పాలస్తీనా సమస్య దశాబ్దాలుగా లక్షలాది మంది ప్రాణాలను హరించింది. ఇటీవల కాంబోడియా-థాయ్‌లాండ్ సరిహద్దు వివాదం వందలాది ప్రాణాలను తీసింది. ఇక ఇరాన్, ఇరాక్, పాకిస్థాన్, బంగ్లాదేశ్ వంటి దేశాలు తరచూ తీవ్రవాదదాడులు, అల్లర్లు, బాంబుల మోతలతో దద్దరిల్లుతున్నాయి. ఆఫ్రికా ఖండంలోని చాలా పేదదేశాల్లో ఆకలికేకలు, మారణహోమాలు, మత ఘర్షణలు, గుంపు పోరాటాలు నిత్యకృత్యంగా మారాయి. కాంగోలో ముస్లిం-క్రిస్టియన్ వర్గాల మధ్య మత ఘర్షణల్లో వందలాది మంది మృత్యువాతపడ్డారు. ఒక్కమాటలో చెప్పాలంటే ప్రపంచంలోని సగం దేశాల్లో నిత్యం అల్లకల్లోలం కనిపిస్తోంది. ఫలితంగా ఆ దేశాల్లోని భూమి కాలుష్యానికో, రక్తపాతానికో నిలయంగా మారుతోంది.

### తిలాపాపం తలాపిడికెడు..

"తిలాపాపం తలాపిడికెడు".. అన్నట్లు పేద, వర్తమాన దేశాల అవసరాలు, దుర్భర పరిస్థితులను ఆసరాగా చేసుకుని ధనికదేశాలు వాటి పబ్బం గడుపుకుంటున్నాయి. పేదదేశాలు తమలోతాము ఘర్షణలు పడుతుంటే వాటికి ఆయుధాలు విక్రయించుకుని అవి లాభం పొందుతున్నాయి. తమ దేశాల్లో చేసే రసాయనిక ప్రయోగాలకు పేద దేశాలను పరిశీలనా కేంద్రాలను చేసుకుంటున్నాయి. అక్కడి భూమిని విషతుల్యం చేసి మరీ మళ్లీ వాటికే అప్పులిచ్చి తమ కాలికింది చెప్పులా మార్చుకుంటున్నాయి. ఫలితంగా అక్కడి ప్రజలను, ప్రకృతి వనరులను దోపిడీ చేస్తున్నాయి. వీటిన్నింటికీ మానవుడి స్వార్థం, ధనికదేశాల దురాశే కారణమని తెలిసినా ఎవరూ ఏం చేయలేని పరిస్థితి. అందుకే భూమాత వేదన అరణ్యరోదనగా మారుతోంది. ఇప్పటికైనా మానవుడు మేల్కొని పుడమితల్లికి మరణవేదన తప్పించాల్సిన సమయం ఆసన్నమైంది. లేకుంటే మానవుడికి మిగిలేది భస్మాసుర హస్తమే అనడంలో అతిశయోక్తి లేదు.

# సోలార్ విద్యుత్‌తో.. ఎంతో మేలు

## విద్యుత్‌శాఖ అధికారులు




సోలార్ విద్యుత్ యూనిట్ ఏర్పాటుతో విద్యుత్ ఉత్పత్తితో పాటు ఆర్థికంగా కూడా ఆదా ఏర్పడుతుందని విద్యుత్ శాఖ అధికారులు చెప్పారు. ఈనెల 7న గురువారం నాడు నెల్లూరు జిల్లా ఆత్మకూరు పట్టణంలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో 'సూర్య ఘర్' కేంద్ర ప్రభుత్వ పథకమైన సోలార్ విద్యుత్‌తో విద్యుత్ ఉత్పత్తి, విద్యుత్ బిల్లుల ఆదాపై అవగాహన సదస్సు నిర్వహించారు.. ఈ పథకం ద్వారా సబ్సిడీతో సోలార్ విద్యుత్ ప్లాంటేషన్ ఏర్పాటు చేసుకొని దాని ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేసుకోవడం, వాటిని వినియోగించి విద్యుత్ బిల్లుల ఆదా చేసుకోవడం ఎలా అనే విషయంపై వక్తలు వివరించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు జిల్లా విద్యుత్ శాఖ కార్యాలయ డిఇటి కె.బాలచంద్ర, ఆత్మకూర్ డివిజనల్ డీఇ భానునాయక్, ఏడీఇ చిన్న స్వామినాయక్, విద్యుత్ శాఖ కలిగిరి ప్రాంత డీఇ కృష్ణమోహన్, పట్టణ ఏఈ జమీల బేగం, ఇతర మండలాల ఏఇలు, జేఇలు పట్టణ విద్యుత్ శాఖ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. వీరితోపాటు సోలార్ ఉత్పత్తి ప్లాంటేషన్ నిర్వాహకులైన గ్రీన్ ఎనర్జీ సోలార్ సిస్టం ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ పి.మధు, వారి సిబ్బంది చైతన్య, రసూల్, శంకర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ సూర్య ఘర్ పథకం ద్వారా సోలార్ ఉత్పత్తి యూనిట్ ఏర్పాటు చేసుకోవడం వల్ల విద్యుత్ సమస్యలు ఏర్పడవని, విద్యుత్తును మీరే ఉత్పత్తి చేసుకోవడం, మీరే వాడుకోవడం, మీ విద్యుత్ బిల్లు తగ్గింపు మీ చేతుల్లోనే ఉంటుందని వారు తెలిపారు. సోలార్ ప్లాంటేషన్ ఏర్పాటుకోసం విద్యుత్ శాఖ కార్యాలయంలో సంప్రదించవచ్చని తెలిపారు.

# జర్నలిస్టుల సమస్యలు తీర్చండి



జిల్లాలోని జర్నలిస్టుల సమస్యలు తీర్చాలని ఏపీడబ్ల్యుజెఎఫ్ నాయకులు ఈనెల 3వతేదీ సోమవారం నాడు జరిగిన ప్రజావిజ్ఞప్తుల కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆనంద్‌కి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జర్నలిస్టు సంఘం నాయకుడు మాట్లాడుతూ, అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు మంజూరుచేయాలని, జర్నలిస్టులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కార్మిక బీమా సదుపాయం, ఆరోగ్యబీమా తదితర సదుపాయాలు సమకూర్చాలని కోరారు. జర్నలిస్టులపై దాడులు అరికట్టేందుకు పోలీసు ఉన్నతాధికారులతో కూడిన హైపవర్ కమిటీలను నియమించాలని, జర్నలిస్టులకు మెరుగైన సౌకర్యాలు అందజేసేవిధంగా మీడియా కమిషన్‌ను ఏర్పాటుచేయాలని సూచించారు. అదేవిధంగా, అక్రిడిటేషన్ కమిటీలో ఏపీడబ్ల్యుజేఎఫ్, ఏపీ బీజెఏసీలకు ప్రాతినిధ్యం కలిగించాలని, పెన్షన్ సౌకర్యం కల్పించాలని కలెక్టర్‌ను కోరారు. ఏపీడబ్ల్యుజె ప్రధాన కార్యదర్శి సుధాకర్, ఏపీ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ అధ్యక్షుడు పి.బాలకృష్ణ, ఏపీ బీజేపి నేఆయకుడు శ్రీధర్‌రెడ్డి, సీనియర్ జర్నలిస్టులు నరసింహులు, కోటేశ్వరరావు, రమణయ్య, మాధవయ్య, వెంకటేశ్వర్లు, బాబు, మహేష్, కరుణానిధి తదితరులు పాల్గొన్నారు.

# రోటరీ వెస్ట్ క్లబ్ మెగా వైద్య శిబిరం



గూడూరు రెండవ పట్టణంలోని మినీ గురుకులంలో మంగళవారం విద్యార్థినులకు రోటరీ వెస్ట్ క్లబ్ ఆధ్వర్యంలో ఎస్వీ రత్నం చారిటబుల్ ట్రస్ట్ అధినేత రొటేరియన్ శ్రీకంటి రామ్మోహన్‌రావు, రాజ్యలక్ష్మి దంపతుల ఆర్థిక సహకారంతో మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ రోహిణి, కంటి వైద్య నిపుణులు సత్యశ్రీ, దంత వైద్యనిపుణులు నారాయణ, గైనకాలజీ డాక్టర్ కీర్తి నారా, చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ త్రివిక్రమ్‌రావు పాల్గొని విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. అనంతరం డాక్టర్లను ఘనంగా సన్మానించారు. క్లబ్ అధ్యక్షులు విజయభాస్కర్‌రెడ్డి, సెక్రటరీ రాఘవరెడ్డి, సీనియర్ రొటేరియన్ ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, వాసుగౌడ్, బొమ్మిడి శ్రీనివాసులు, సనత్‌రెడ్డి, ధనుంజయరెడ్డి, నాసిన నాగులు, రవీంద్రనాథ్‌రెడ్డి, ఎం హరినాద్‌రెడ్డి, సిద్దారెడ్డి, లక్ష్మీనారాయణ, కృష్ణంరాజు, పి.హరినాథ్‌రెడ్డి, నవీన్ జయకుమార్, హెడ్మాస్టర్ మేరీ తదితరులు పాల్గొన్నారు.





## అంగరంగ వైభవం..

# అలఘునాథస్వామి కుంభాభిషేకం

### ○ పాల్గొన్న ఎంపీ వేమిరెడ్డి దంపతులు

ఆత్మకూరులో ఈనెల 7వ తేదీ గురువారం శ్రీదేవీ భూదేవీ సమేత శ్రీ అలఘు నాథస్వామివారి కుంభాభిషేక మహోత్సవం అంబరాన్నంటే సంబరంగా జరిగింది. ఈ పూజల్లో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి.. కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు పాల్గొని స్వామి వార్లకు పూజలు చేశారు. స్వామివారి ఆలయ శిఖరానికి అభిషేకం చేసి అలఘు నాథస్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత, ఆలయానికి వచ్చిన వేమిరెడ్డి దంపతులకు ఆలయ అర్చకులు, నిర్వాహకులు సాదర స్వాగతం పలికారు. అనంతరం, అలఘు నాథస్వామివారి కల్యాణోత్సవాన్ని తిలకించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, దాదాపు 800 సంవత్సరాల చరిత్ర కలిగిన శ్రీ అలఘునాథస్వామి దేవాలయాన్ని సందర్శించగలడం తమ అదృష్టంగా భావిస్తున్నామన్నారు. స్వామివారి పవిత్రమూర్తిని పునఃప్రతిష్ఠ చేసి పన్నెండేళ్లవుతున్న నేపథ్యంలో జరిగిన ఈ మహా కుంభాభిషేకంలో పాల్గొనడం తమ పూర్వ జన్మ సుకృతమన్నారు. రాష్ట్రముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాలనలో దేవాలయాలు బాగా అభివృద్ధి చెందుతున్నాయన్నారు. రాష్ట్రంలో ఆలయాల పవిత్రత, హిందూ ధర్మ రక్షణే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. సీఎం చంద్రబాబు అన్ని మతాలకు ప్రాధాన్యత ఇస్తూ.. పాలన సాగిస్తున్నారని వివరించారు. ఆలయాల అభివృద్ధికి రూ.100 కోట్లు కేటాయించారని తెలిపారు. అలాగే ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆగస్టు 15 నుంచి 'స్త్రీ శక్తి పథకం' పేరుతో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించనున్నారని వారు చెప్పారు. అధికారంలోకి వచ్చిన ఈ ఏడాది కాలంలో అటు సంక్షేమ పథకాలను అమలు చేస్తూనే.. రాష్ట్రానికి పెట్టుబడులు తెస్తున్న సీఎం చంద్రబాబుకి స్వామివారి ఆశీస్సులు పుష్కలంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ, అలఘునాథస్వామి దేవాలయాన్ని అభివృద్ధి చేసేందుకు దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఎంతో కృషిచేశారని తెలిపారు. టీడీపీ నాయకులు కాటంరెడ్డి రవీంద్రారెడ్డి దంపతులు, టీడీపీ నాయకులు కేతంరెడ్డి వినోద్‌రెడ్డి, బిజెపి నాయకులు కుడుముల సుధాకర్, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

## లంబోదర సెంటర్‌లో..

# వినాయక చవితి వేడుకలకు భారీ ఏర్పాట్లు

నెల్లూరు మాగుంట లేఅవుట్ మినీ బైపాస్‌రోడ్డులోని డా.బెజవాడ గోపాలరెడ్డి కూడలిలో ఉన్న లంబోదర సెంటర్‌లో వినాయక చవితి వేడుకల నిర్వహణకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 4న లంబోదర ఉత్సవ కమిటీ నిర్వాహకుడు, టీడీపీ నాయకుడు నూకరాజు మదన్‌కుమార్ రెడ్డి, దాట్ల చక్రవర్ధన్‌రెడ్డి తదితరుల ఆధ్వర్యంలో గణేష్ విగ్రహ ప్రతిష్ఠ కోసం పూజలు చేసి శాస్త్రోక్తంగా గుంజను ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గత ఏడాది నుంచి లంబోదర సెంటర్ ఏర్పాటుచేసి వినాయక చవితి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నామని, ఈసారి కూడా ఈ నెల 27వ తేదీ నుంచి అయిదు రోజుల పాటు వైభవోపేతంగా వినాయకునికి పూజలు, వేడుకలు



చేస్తున్నామని తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీ విఘ్నేశ్వరస్వామి ఆశీస్సులు అందుకోవాలని కోరారు.

### 27 నుంచి ఉత్సవాలు :

వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా ఈనెల 27వ తేదీ ఉదయం 8 గంటలకు లంబోదర సెంటర్‌లో స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ, సాయంత్రం 108 జంటలతో గణపతి పూజ ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. అదేవిధంగా, 28న ఉదయం 9గంటలకు విద్యాగణపతి పూజ, విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్స్ పంపిణీ, మధ్యాహ్నం 12 గంటలకు అన్నదానం, సాయంత్రం 4గంటలకు ఉట్టి మహోత్సవం వేడుకగా ఉంటుందన్నారు. 29వ తేదీ ఉదయం పూజలు, మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం పూలంగిసేవ, విశేషపూజలుంటాయని, 30న ఉదయం గరికపూజ, మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం గణపతిపూజ, 7గంటల నుంచి కళాంజలి లైవ్ ఆర్కెస్ట్రా, మాధవ్ ఈవెంట్స్ వారిచే ప్రముఖ సినీ గాయకుల పాటకచ్చేరీ ఉంటాయని, 8 గంటలకు స్వామివారి లడ్డూ వేలంపాట ఉంటుందని తెలిపారు. 31న ఉదయం పూజలు, సాయంత్రం 6.30 గంటల నుంచి విశేష పుష్పాలంకరణలతో స్వామివారి ఊరేగింపు, ఆ తర్వాత నిమజ్జనోత్సవం ఉంటాయని వారు వివరించారు.

# విలువిద్యలో సత్తాచాటిన 'డా.కిషోర్స్ రత్నం' విద్యార్థులు

జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇటీవల నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఈనేల 7..గురువారం నాడు జరిగిన జిల్లాస్థాయి ఆర్చరీ (విలువిద్య) పోటీల్లో డా.కిషోర్స్ రోషిణి రత్నం హైస్కూల్ విద్యార్థులు తమ సత్తా చాటారు. బాలికల విభాగంలో రికర్వ్ రౌండ్ కేటగిరీలో జరిగిన పోటీల్లో పి.భావజ్ఞ హంసిని ప్రథమస్థానం సాధించింది. అదేవిధంగా కాంపౌండ్ రౌండ్ కేటగిరీలో కె. జనని ప్రథమ స్థానం, ఇండియన్ రౌండ్ కేటగిరీలో కె.మోక్ష తృతీయ స్థానం సాధించారు. జిల్లాస్థాయిలో ఎంపికైన వీరు, ఈనెల 11, 14 తేదీల్లో గుంటూరులో జరుగనున్న జోనల్ స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొంటారని స్కూలు నిర్వాహకులు తెలిపారు. ఈ విద్యార్థులు డా.కిషోర్స్ రత్నం సరస్వతీనగర్ ఏటీఐజడ్ యాక్టివిటీ టైమ్ జోన్‌లో ఆర్చరీ క్రీడలో, భరద్వాజ ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్నారని




తెలిపారు. ఆ విద్యార్థుల ప్రతిభను డా.కిషోర్స్ రత్నం విద్యా సంస్థల డైరెక్టర్లు డా.కృష్ణకిషోర్, వాసంతి ప్రశంసిస్తూ, వారు మరెంతో ఉన్నత శిఖరాలను అందుకోవాలని ఆకాంక్షించారు. విద్యాసంస్థల జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు, జూనియర్ మేనేజర్ అజయ్‌సింగ్, ప్రిన్సిపాల్ మణిమాల తదితరులందరూ విజేతలైన ఆ విద్యార్థులను అభినందించారు.

లాయర్
ఆగస్టు 08, 2025

# అపోహాలు వీడండి.. అవయవదానం చేయండి

నేటి ఆధునిక కాలంలో ప్రజల జీవనశైలి, ఆహారపు అలవాట్లు మారిపోతుండడంతో, శరీరంలోని అవయవాలు నానారకాల సమస్యలకు, వ్యాధులకు గురవుతున్నాయి. అసలే కాలుష్యం, మరోవైపు కల్తీలు సమాజాన్ని ముంచేస్తున్న నేటి రోజుల్లో ఇక జబ్బులకు కొదవేముంటుందీ?.. పిల్లలు, పెద్దలని తేడా లేకుండా ప్రతి కుటుంబంలో ఏదో ఒక అనారోగ్యంతో బాధపడేవారు ఉండనే ఉంటున్నారు. ముఖ్యంగా గుండె జబ్బులు, లివర్ వ్యాధులు, ఊపిరితిత్తుల సమస్యలు వంటివి ఇటీవలికాలంలో ముదిరిపోతున్నాయి. ఎక్కడ చూసినా ఇవే బాధలు. దేశంలో ఇలా అనారోగ్యాలకు గురైన వారి సంఖ్య లక్షల్లోనే ఉంటోంది. వారిలో అనేకమంది అవయవాలు పాడైపోయి ప్రాణభయంతో బిక్కుబిక్కుమంటున్నారు. రోగగ్రస్తమైన తమ అవయవాలను మార్చుకునే పరిస్థితులు లేక, అందుకు అవసరమైన అవయవ దాతలు అందుబాటులో లేక విలవిల్లాడుతున్నారు. ముఖ్యంగా మూత్రపిండాలు దెబ్బ తిని అనారోగ్యంతో అవస్తలు పడుతున్నవారు దేశంలో ఏటా కనీసం రెండు లక్షలమంది వరకు ఉంటారని అంచనా. అదేవిధంగా లివర్ చెడిపోయి, ఇతరత్రా అవయవాలు పని చేయక అసహాయస్థితిలో ఉన్నవారి సంఖ్య కూడా గణనీయంగానే ఉంటోంది. అవయవ మార్పిడితో వారిని కాపాడుకునే వీలున్నా, అవయవాలను దానం చేసేవారు మాత్రం అరుదైపోతున్నారు. ఎక్కడో కొన్నిచోట్ల మాత్రం..చావుబతుకుల్లో ఉన్న తమవారిని కాపాడుకునేందుకు వారి కుటుంబసభ్యులు, లేదా దగ్గరి బంధువులు అవయవ దానం చేసి వారిని బతికించుకుంటున్నారు. మరికొన్నిచోట్ల మరణించినవారి నుంచి, వారి కుటుంబసభ్యుల అనుమతితో అవయవాలు సేకరించి బాధితులకు అమరుస్తున్నారు. చాలామందికి ఆ సదుపాయం లేక ప్రాణాలు పోగొట్టుకుంటూనే ఉంటున్నారు. అయితే, వాస్తవానికి అవయవదానాల పట్ల గతంలో కంటే ఇప్పుడు కొంత అవగాహన పెరిగింది కానీ, ఆశించినస్థాయిలో మాత్రం దాతలు పెరగడం లేదు. అవయవదానాల్లో అమెరికా, చైనా, స్పెయిన్ దేశాలు అగ్రగాములుగా ఉంటున్నాయి.. కానీ, మనదేశంలో ప్రభుత్వాలు అవయవదానాన్ని ప్రోత్సహిస్తూనే ఉన్నా, అవయవ దానంలో ఎంతో వెనుకబడే ఉన్నాం. ఆ దేశాలతో పోలిస్తే, మనం ఎక్కడో ఉన్నాం. దేశంలోని అనేక రాష్ట్రాల్లో ఈ విషయాలను అంతగా పట్టించుకోవడం లేదు. అవయవదానం ఎంత ముఖ్యమో గ్రహించడం లేదు. అనేక వైద్యశాలల్లో అవయవమార్పిడికి అవసరమైన సామగ్రి కానీ, వైద్యనిపుణులు కానీ ఉండడం లేదు. ఈ బృహత్కార్యానికి ఇలాంటివన్నీ ఒక పెద్ద లోటు.

బతికున్నప్పుడు రక్తదానం, మరణానంతరం అవయవ దానం చేయడం వల్ల మరికొందరికి పునర్జన్మను ప్రసాదించినట్లవుతుందని వైద్యరంగ నిపుణులు స్పష్టం చేస్తున్నారు. మరణానంతరం..ఒకరి అవయవదానం ద్వారా ఎనిమిది మంది ప్రాణాలను కాపాడవచ్చు. వైద్యుల సూచనల మేరకు గుండె, మూత్రపిండాలు, ఊపిరితిత్తులు, కాలేయం, ఎముకల్లోని మజ్జ, మూలకణాలు, క్లోమం, చిన్నపేగు వంటి అవయవాలను దానం చేయవచ్చు. జీవించి ఉన్న దాతలు ఒక మూత్రపిండాన్ని, ఒక ఊపిరితిత్తిని, కాలేయంలో ఒక భాగాన్ని, క్లోమగ్రంథిలో ఒక భాగాన్ని, ప్రేగులో ఒక భాగాన్ని దానం చేయవచ్చని నిపుణులు చెప్తున్నారు. బ్రెయిన్ డెడ్ అయిన దాతల త్యాగం కూడా మరికొందరి ప్రాణాలను నిలబెడుతుంది. మనదేశంలో జరిగే అవయవ దానాల్లో ముఖ్యంగా రక్తసంబంధీకలు, లేదా వారి బంధువులు చేస్తున్న అవయవదానాలే అధికంగా ఉంటున్నాయి. అలాంటి దాతల్లో కూడా ఎక్కువగా మహిళలే ముందంజలో ఉండడం ఎంతైనా విశేషం. మన దేశ స్త్రీమూ ర్తుల దయాగుణానికది నిదర్శనం.

ఏదేమైనా, అవయవదానం ఎంతో పవిత్రమైనది.. పుణ్యప్రదమైనదనడంలో ఎలాంటి సందేహం లేదు. బాధితుల ప్రాణాలను కాపాడడం కంటే గొప్పదానం ఇంకేముంటుందీ?.. అన్ని దానాల్లోకెల్లా అన్నదానం గొప్పదే కావచ్చు..కానీ నేటి దుర్భర పరిస్థితుల్లో మనుషుల ప్రాణాలను కాపాడే అవయవ దానం కూడా గొప్పదే కదా!.. అందుకే, ఒక్కసారి అందరూ ఆలోచించాలి. ఇకనైనా అవయవ దానం పట్ల ఉన్న భయాలను, అపోహాలు..అనుమానాలని వదిలిపెట్టి, బాధితుల ప్రాణాలను కాపాడేందుకు ప్రతిఒక్కరూ మానవతా హృదయంతో ముందుకు రావాలి. ప్రాణాపాయస్థితిలో ఉన్న బాధితులకు అవయవదానం చేసి, వారి ప్రాణాలను నిలిపి, ప్రాణదాతలుగా మారాలి. తద్వారా జీవితాలను ధన్యం చేసుకోవాలి.

**(ఆగస్టు 3న జాతీయ, 13న అంతర్జాతీయ అవయవదాన దినోత్సవం)**

# జగన్‌మోహన్‌రెడ్డి సహనం కోల్పోతున్నాడా?

ఆంధ్రప్రదేశ్ మాజీముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రవర్తన ఇటీవల విచిత్రంగా, విడ్డూరంగా అనిపిస్తోంది. గడచిన అయిదేళ్ళు అధికారం వెలగబెట్టిన ఆయన ఓ అయిదేళ్ళు ప్రతిపక్షంలో కూర్చోవడానికి ఎందుకో అయిష్టతని, అసహనాన్ని ప్రదర్శిస్తున్నాడు. ముఖ్యంగా సభల్లోనూ, మీడియా ముందూ మాట్లాడేటప్పుడు ఆయనలో ఆ పోకడ స్పష్టంగా కనిపిస్తోంది. ప్రస్తుత ప్రభుత్వ పరిపాలనా విధానం పట్ల ఆయన అస్సలు మాట్లాడడంలేదు. కూటమి ప్రభుత్వ పాలనా విధానాలలో లోపాలని జగన్ ఎత్తి చూపడంలేదు. వారి వైఫల్యాలని ప్రశ్నించడం లేదు. ఎంతసేపటికీ "మూడేళ్ళు కళ్ళు మూసుకుంటాం, మళ్ళీ అధికారంలోకి వస్తాం, అధికారుల భరతంపడతాం" అని మాత్రమే అంటున్నారు. కక్షసాధింపు పైనే పాడిందే పాటగా మాట్లాడుతున్నారు. మొన్న నెల్లూరులో కూడా ఆయన ఉపన్యాసం ఆసాంతం అదే అంశంపై కొనసాగింది. 40శాతం ఓట్ షేరింగ్ కలిగిన పార్టీ నాయకుడిగా ఉంటూ, ఒక మాజీ ముఖ్యమంత్రిగా పనిచేసిన అనుభవం కలిగిన జగన్ లాంటి నేత ఇలా అపరిపక్వ ధోరణితో మాట్లాడడం విచారకరం.

– వై.వీ.రెడ్డి, **బంగ్లాతోట, నెల్లూరు.**




## ఢిల్లీలో చైన్ దొంగలు.. యం.పీ.కే దిక్కులేదు!

దేశ రాజధాని కొత్తఢిల్లీలో పార్లమెంటు సభ్యురాలు సుధా రామకృష్ణన్ మెడలోని గొలుసును ఎవరో తెంపుకు పోయారంట. పాపం ఆమె మెడకూడ కోసుకుపోయిందని వార్త. ఆమె కింద పడిపోయి బాగా దెబ్బలు కూడా తగిలాయట. సాక్షాత్తూ దేశ రాజధానిలో ఒక ఎంపీ పరిస్థితే ఇలా ఉంటే, ఇక ఈ దేశంలో సామాన్య మానవులకు దిక్కెవరు. ఇదా మన భారతదేశం. భారతదేశం వేదభూమి, కర్మభూమి, పుణ్యభూమి, యోగభూమి అంటారు. ప్రపంచ దేశాలన్నిటికి మనది ఆధ్యాత్మిక రాజధాని అని గొప్పగా చెప్తుంటారు. అలాంటి మన దేశంలోని రాజధానిలోనే నేరాలు – ఘోరాలు పెరిగిపోతున్నాయి. ఇది కలియుగం – కలుషిత కాలం..!

డాక్టర్ ఎం. పెంచలరెడ్డి, **నెల్లూరు.**

## నెల్లూరు నగర్ కమిషనర్‌కి పన్నులపై వున్న శ్రద్ధ.. పనులపై లేదు!

నెల్లూరు నగర కార్పొరేషన్ కమిషనర్ సారు పన్నుల వసూళ్ళ విషయంలో యమ స్ట్రిక్టుగా వున్నారని వాళ్ళ సిబ్బందే చెప్తున్నారు. అదే కమిషనర్‌కి పన్నులపై వున్నంత శ్రద్ధ పనులపై కూడా ఉంటే చాలా బాగుంటుంది. ముఖ్యంగా నగరంలోని ప్రధానకూడళ్లలో రోడ్డు మార్జిన్‌లని అక్రమంగా ఆక్రమించుకున్న వారి భరతం పట్టవలసిన బాధ్యత కమిషనర్‌దే. మరి ఆయన మాత్రం వాటివైపు కన్నెత్తికూడా చూడడంలేదు. ఉదాహరణకి అన్నమయ్య కూడలి నుండి మాగుంట లే అవుట్‌కి వచ్చే మార్గం సగానికిపైగా ఆక్రమణకి గురైపోయింది. ఇక్కడ అనధికారికంగా బాడుగలు కూడా దండుకుంటున్నారు. ఇందులో ఎవరి వాటా ఎంతో ఆ అన్నమయ్యకే ఎరుక. అలాగే ముత్తుకూరు రోడ్డు, రామలింగాపురం, హరనాథపురం ప్రాంత పరిస్థితి కూడా అదే. ఇలా నగరంలో చాలాచోట్ల ముఖ్య కూడళ్ళు దురాక్రమణకి గురైపోతూ రోడ్లు కుంచించుకుపోతున్నాయి. అయ్యా నందన్ గారూ.. కాస్త వాటిసాయి చూడండయ్యా సారూ!

ఆర్.పి.రామయ్య, **కొండాయపాలెం.**




# ఘోరాతి ఘోరం..'మనుషులతో వ్యాపారం'

'కోటి విద్యలు కూటి కొరకే' అన్నారు మన పెద్దలు. 'ఏ పనిచేసుకున్నా జానెడు పొట్టకోసమే కదా' అని అంటూండడం కూడా రివాజు. తరతరాలుగా రకరకాల వ్యాపారాలు చేసుకుంటూ బతుకుతెరువు సాగించే కుటుంబాలకి లెక్కే లేదు. అయితే, ఇలా ఏదో ఒక వ్యాపారం చేసుకుని జీవించాల్సిన మనుషులు, ఇప్పుడు మనుషుల్నే వ్యాపారవస్తువులుగా చేసి బతికేస్తుండడం ఒక ట్రెండుగా మారింది. ఇటీవలికాలంలో ఈ అమానవీయ వ్యాపారం ఒక పెద్ద మాఫియాగా అవతరించిందన్న ఆందోళన సమాజాన్ని బెంబేలెత్తిస్తోంది. ఏదోఒక విధంగా డబ్బు సంపాదించాలనే దుగ్ధతో కొందరు అక్రమార్కులు ముఠాలుగా ఏర్పడి, పసిపిల్లల్ని సైతం మాయంచేసి అమ్మేసుకుంటున్నారు. బాలికలు, యువతులని కూడా కిడ్నాప్ చేసి అమ్ముకుని ఆ పాపిష్టి డబ్బుతో జల్సాలు చేసుకుంటున్నారు. ఇలాంటి మాఫియా ముఠాలు మనదేశంలో కోకొల్లలుగానే ఉన్నాయని అంచనా. ఏటా వేలాదిమంది వారి 'కిడ్నాప్'లతో మాయమైపోతున్నారు. కొందరు 'తప్పిపోయిన వారి జాబితా'లోకి చేరుతున్నారు. మరికొందరు అసలు ఎటుపోయారో, ఏమైపోయారోనన్న ఆచూకీ కూడా తెలియడం లేదు. దేశంలో ఎంతోకాలంగా ఇలాంటి దుర్మార్గాలు, మానవ అక్రమరవాణాలు జరిగిపోతూనే ఉన్నాయి. ప్రతి సంవత్సరం వేలసంఖ్యలోనే అమాయకపు పిల్లలు, బాలికలు, యువతులు మాయమైపోతున్నారని అధికారిక లెక్కలే చెప్తున్నాయంటే ఈ అంతుచిక్కని వ్యవహారం ఎంత తీవ్రస్థాయిలో ఉందో ఊహించుకుంటేనే వెన్నులో వణుకుపుడుతుంది.

### రకరకాల కారణాలతో.. 'మిస్సింగ్'లు!

ఒక మనిషి కనిపించకపోతే ఆ కుటుంబం ఎంత కలవరపడుతుందో చెప్పలేం. అందులోనూ తాము అల్లారుముద్దుగా పెంచుకుంటున్న బాబో, పాపో తప్పిపోయి, ఎంత వెదికినా కనిపించకపోతే ఆ ఇంట్లో వారి పరిస్థితి ఎంత దయనీయంగా ఉంటుందో ఊహించుకోవచ్చు. అయితే.. జాలి, దయ, కరుణ వంటి గుణాలు రాక్షస ప్రవృత్తితో ఉండే ఆ అక్రమార్కులకు అస్సలు ఉండవు. అప్పుడే పుట్టిన బిడ్డల్ని పురిటిలోనే ఆసుపత్రుల నుండి మాయం చేసేస్తున్నారు. రోడ్లమీద వెళ్ళే అమాయక బాలికల్ని మాయమాటలు చెప్పి తమతోపాటు తీసుకెళ్ళిపోతున్నారు. కొంతమంది యువతులకి ఏకంగా మత్తుమందు ఇచ్చి కిడ్నాప్ చేసేసి ఏ వ్యభిచార గృహాలకో అమ్మేస్తున్నారు. అభం శుభం తెలియని పసిబిడ్డలని ఎక్కడెక్కడినుంచో తీసుకొచ్చి ఆడ భిక్షగాళ్లకు అప్పజెప్పి వారిచేత భిక్షమెత్తిస్తారు. వీటన్నిటి వెనుక పెద్ద మాఫియానే ఉంటుందని జనం భయపడిపోతున్నారు.

### యువతుల జీవితాలతో వ్యాపారాలు!

మహిళల్ని బురిడీ కొట్టించి గల్ఫ్ దేశాలకు పంపించి, వారి శరీరాలతో కూడా వ్యాపారం చేసేవారి దురాగతాలకి లెక్కే లేదు. అంతేకాదు, సహజంగా మతి తప్పో, లేకపోతే ఇంటిమీద అలిగో, ఇళ్ళలోంచి వెళ్ళిపోయేవాళ్లు కూడా అనేకమంది ఉంటారు. కొంతమంది యువతులు ప్రేమ వ్యవహారాల్లో మునిగిపోయి కని, పెంచిన తల్లితండ్రుల మాటలను కాలదన్ని, ప్రియుడి మాటలే ప్రీతిగా మారి, ఇళ్లనుంచి వెళ్లిపోతుంటారు. చివరికి ఎక్కడ తేలతారో వారికే తెలియదు. అలాంటివాళ్లను మాయమాటలతో బుట్టలో వేసుకుని, తమ స్వాధీనంలోకి తెచ్చుకోవడం ఈ మానవ వ్యాపారులకు చిటికెలో పని.

ఇళ్లల్లో ఆర్థిక పరిస్థితి బాగాలేక, ఈ పేద బతుకులెందుకనే ఆలోచనతో గడప దాటిపోయే యువతులు కూడా లేకపోలేదు. అయితే, అలా బయటకివెళ్ళిన వాళ్ళు ఈ మాయగాళ్ళ ఊబిలో ఇరుక్కుని, అటు తిరిగి ఇంటికి పోలేక, కిడ్నాపర్ల వద్ద ఉండలేక కొంతమంది ఆత్మహత్యలకి పాల్పడుతుంటే, మరికొంత మంది వ్యభిచార కూపంలో కూరుకుపోతున్నారు. ఇలా దేశవ్యాప్తంగా కొన్ని వేలమంది తరచూ తప్పిపోతున్నారు. వారి ఆచూకీ కూడా తెలియడంలేదు. ఆడపడదపా మాత్రం పోలీసులు మిస్సింగ్ కేసులని ఛేదించి, తప్పిపోయిన లేదా పారిపోయిన వాళ్ళని తమ కుటుంబ సభ్యుల వద్దకి చేరుస్తున్నారు. మన దేశంలో ఇంకా కొన్ని వేలసంఖ్యలో ఉన్న 'మిస్సింగ్ కేసులు' ఎప్పుడు ఒక కొలిక్కి వస్తాయో ఆ దేవుడికే తెలియాలి.

### ఏపీలో 'ఆపరేషన్ ట్రేస్' వినూత్న మానవీయ కార్యక్రమం

ఏ కారణం చేతైనాసరే, తప్పిపోయిన వాళ్ళని తిరిగి ఇళ్లకిచేర్చే అత్యంత మానవీయ కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వం చేపట్టింది. 'ఆపరేషన్ ట్రేస్' పేరుతో ఆంధ్రా పోలీసుబృందాలు తప్పిపోయినవారి ఆచూకీ కనుగొనేందుకు ఈ ఆగస్టు 1 నుంచి సంసిద్ధులయ్యారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో, ఆగస్టు చివరిదాకా, నెలరోజుల పాటు ఈ కార్యక్రమం తొలి దశ కొనసాగుతుంది. ఆ తరువాత కూడా ఇది కొనసాగుతుంది. తప్పిపోయిన వారి తల్లితండ్రులు, మహిళా శిశు సంక్షేమ అధికారులు, ఐజీలు, డీఐజీలు, ఎస్పీలు సహా పోలీసు బృందం అందరూ కలసి ఎక్కడికక్కడ 'మిస్సింగ్ కేసుల'ను పూర్తిస్థాయిలో విచారిస్తారు. తప్పిపోయిన వారిని తిరిగి తీసుకొచ్చేందుకు అన్నివిధాలా ప్రయత్నిస్తారు. ముఖ్యంగా బాలికలు, యువతులు ఎక్కడెక్కడ ఎలా తప్పిపోయారో దర్యాప్తు చేసి, వారిని రక్షించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటారు. ఈ ప్రత్యేక కృషితో కనీసం కొంతమంది ఆచూకీ అయినా కనిపెట్టొచ్చన్నది ప్రభుత్వ వ్యూహం. ఇదే క్రమంలో మానవ వ్యాపారాలు చేసే కిడ్నాపర్లను, పసిబిడ్డలను అపహరించుకుపోయే మాయగాళ్ళను, మహిళలను మోసగించి వ్యభిచార గృహాలకు అమ్మేసే మాఫియా ముఠాల ఆచూకీని కూడా గుర్తించి, వారి భరతంపట్టాలి. మనుషులతో వ్యాపారంచేసే దౌర్భాగ్యపు గ్యాంగుల ఆటకట్టించాలి. అప్పుడే ఇలాంటి కార్యాచరణ కార్యక్రమాలు మరింత సత్ఫలితాలివ్వడమే కాకుండా సత్కార్యాలుగా సార్థకమవుతాయి. ప్రభుత్వం, పోలీసుశాఖ చేపట్టిన ఈ 'ఆపరేషన్ ట్రేస్' అనే బృహత్తర కార్యక్రమం పట్ల ఇప్పటికే కనిపించకుండా పోయిన పిల్లల కుటుంబసభ్యులు హర్షం ప్రకటిస్తున్నారు. తమ పిల్లల ఆచూకీ లభిస్తుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఆరంభ శూరత్వంలా కాకుండా పోలీసుశాఖ చిత్తశుద్ధితో పనిచేస్తే ఈ ఆపరేషన్ ట్రేస్ మంచి ఫలితాలని ఇస్తుందని నమ్ముతున్నారు. పోలీస్ పారాహుషార్..!

– రాజశ్రీ

# డీఏపీ ఎరువుల.. దిగుమతిపై వివరాలేమిటి?



**లోక్‌సభలో ఎంపీ వేమిరెడ్డి ప్రశ్నలు**

డీఏపీ ఎరువుల దిగుమతిపై వివరాలేమిటి అని ఇటీవల లోక్‌సభలో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నించారు. గత జనవరి నుండి చైనా నుంచి ఒక్క టన్ను డీఏపీ ఎరువు కూడా రాలేదనే విషయం నిజమేనా అని అడిగారు. చైనా డీఏపీపై ఎగుమతి ఆంక్షలు విధించారా?.. అయితే, ప్రత్యామ్నాయం ఏమిటి అని ఆయన ప్రశ్నించారు. అందుకు కేంద్ర రసాయనాలు, ఎరువుల మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి అనుప్రియ పటేల్ సమాధానమిస్తూ, చైనా నుంచి 2024-25 మధ్య డీఏపీ ఎరువుల దిగుమతి తగ్గిందన్నారు. 2023-24 లో దిగుమతులు 22.28 లక్షల మెట్రిక్ టన్నులు ఉండగా, 2024-25 మధ్య కేవలం 8.47 లక్షల మెట్రిక్ టన్నులని వివరించారు. అమ్మోనియం ఫాస్ఫేట్ సల్ఫేట్(ఏపీఎస్) డీఏపీకి పాక్షిక ప్రత్యామ్నాయంగా ఉపయోగపడుతుందని తెలిపారు. ముఖ్యంగా సల్ఫర్ లోపం ఉన్న నేలల్లో, సల్ఫర్ అవసరం అయిన పంటలకు ఇది ప్రత్యామ్నాయమని చెప్పారు.

## స్కిల్ కౌన్సిల్స్ ఏర్పాటుకు తీసుకుంటున్న చర్యలేమిటి?

జాతీయ నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఎన్ఎస్‌డీసీ) దేశంలో దాదాపు 40 సెక్టార్ స్కిల్ కౌన్సిల్‌లను ఏర్పాటు చేసిందనేది వాస్తవమా అని ఎంపీ వేమిరెడ్డి ఈనెల 4న లోక్‌సభలో ప్రశ్నించారు. ఈ మేరకు సెక్టార్ స్కిల్ కౌన్సిల్‌ల ఏర్పాటుపై పలు ప్రశ్నలు వేశారు. ఆంధ్రప్రదేశ్‌లో జిల్లా వారీగా ఏర్పాటు చేసిన వాటి వివరాలు కోరారు. అందుకు కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ సహాయమంత్రి జయంత్‌చౌదరి లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. కేంద్ర స్కిల్ డెవలప్‌మెంట్ మరియు ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జాతీయ నైపుణ్యాభివృద్ధి సంస్థ దేశవ్యాప్తంగా 36 సెక్టార్ స్కిల్ కౌన్సిల్‌లను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఇవి సంబంధిత రంగాల నైపుణ్యాభివృద్ధి అవసరాలను గుర్తించడంతో పాటు నైపుణ్య సామర్థ్య ప్రమాణాలన నిర్ణయిస్తాయని, పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా శ్రామిక శక్తిని సిద్ధం చేసే క్రమంలో ప్రభుత్వానికి ఈ అధ్యయనాలు ఎంతో ఉపకరిస్తాయని వివరించారు.

# జగన్‌పై ప్రజాభిమానాన్ని ఎవరూ ఆపలేరు

**నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి**



మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిపై ఉన్న ప్రజాభిమానాన్ని ఎవరూ ఆపలేరని మరోసారి నిరూపితం అయిందని వెంకటగిరి నియోజకవర్గ వైకాపా సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. జగన్ నెల్లూరు పర్యటనలో భారీస్థాయిలో పోలీసులను పెట్టింది జగన్ భద్రత కోసం కాదు, జనాన్ని రాకుండా నిలువరించేందుకేనని ఆయన అన్నారు. ఇటీవల వెంకటగిరిలో ఆయన వెంకటగిరిలోని తమ నివాసంలో, మున్సిపల్ ఛైర్‌పర్సన్ భానుప్రియ, కౌన్సిలర్లు, నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జగన్ పర్యటనలో సుమారు 2వేల మంది పోలీసులను బందోబస్తుగా నియమించారన్నారు. కూటమి పార్టీ నాయకులు ఆరోపించినట్లు, జన సమీకరణ కోసం తాము ఎక్కడైనా వాహనాలు ఏర్పాటు చేశామా అని ప్రశ్నించారు. నెల్లూరుకు వెళ్లే ఇతర నియోజకవర్గాల వైకాపా నాయకులు, కార్యకర్తలను ఎక్కడికక్కడ వారి వాహనాలను సీజ్ చేయడం ద్వారా పలువురు పోలీసులు ఇబ్బందులు పెట్టారని విమర్శించారు. అయితే, కూటమి ప్రభుత్వం చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయని, అరచేతితో సూర్యుడిని ఆపడం సాధ్యమా అని ఆయన ప్రశ్నించారు. వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పర్యటన విజయవంతం చేసేందుకు కృషి చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలని ఆయన అన్నారు.

# విడవలూరు ఎంపీటీసీ స్థానం..టీడీపీ కైవసం

ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో విడవలూరు ఎంపీటీసీ స్థానాన్ని టీడీపీ కైవసం చేసుకుంది. ఎంపీటీసీ ఎన్నికల్లో వైసీపీ తమ అభ్యర్థిని పోటీకి నిలబెట్టలేకపోవడంతో, టీడీపీ అభ్యర్థి చలంచర్ల కామేశ్వరమ్మ ఏకగ్రీవంగా గెలుపొందింది. దాంతో స్థానికంగా టీడీపీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతమ్మ ఆధ్వర్యంలో కలిసికట్టుగా ప్రజలకు ఉత్తమసేవలందిస్తామని కామేశ్వరమ్మ తెలిపారు.

# ‘అక్షర విద్యాలయ’లో ఆటల పోటీలు

**• ఆంధ్ర, తెలంగాణాల నుండి 2700 మంది క్రీడాకారులు**

వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉన్న అక్షరవిద్యాలయలో ఆగస్టు 5 నుండి సీబీఎస్ఇ-7వ క్లస్టర్ అథ్లెటిక్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఆంధ్ర, తెలంగాణాల నుండి దాదాపు 2700మంది విద్యార్థి-విద్యార్థినులు పాల్గొంటున్న అతిపెద్ద క్రీడోత్సవమిది. 1500మంది బాలురు, 1200మంది బాలికలు ఈ పోటీల్లో పాల్గొంటున్నారు. ఈ పోటీలకు ఒకే పాఠశాల వేదిక కావడం ఉభయ తెలుగు రాష్ట్రాలలో ఇదే ప్రథమం. స్వర్ణభారత్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ, అక్షర విద్యాలయ కరెస్పాండెంట్ దీపావెంకట్ ఆధ్వర్యంలో, డీఎస్‌డీఓ యతిరాజ్ సారథ్యంలో జరుగుతున్న ఈ కార్యక్రమాలను, పాఠశాల డైరెక్టర్ కుముద, పాఠశాల ప్రిన్సిపాల్ ప్రియాజాకబ్ పర్యవేక్షిస్తున్నారు. ఆగస్టు 10వతేదీ వరకు ఈ పోటీలు జరుగనున్నాయి. పోటీల ప్రారంభోత్సవ వేడుకలు ఈనెల 5న ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథులుగా సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, డీఎస్డీఓ యతిరాజ్, డీఇఓ బాలాజీరావు, డీఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ వి.సుజాత తదితరులు పాల్గొన్నారు. మార్చ్‌ఫాస్ట్, జ్యోతి ప్రకాశనం మరియు జెండా వందనంతో పోటీలు ప్రారంభమయ్యాయి.



## సర్వేపల్లికి జాతీయ స్థాయిలో గుర్తింపు - ఎమ్మెల్యే సోమిరెడ్డి

భారత పూర్వ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యానాయుడు ఆశీస్సులతో సర్వేపల్లి నియోజకవర్గంలో ప్రతిష్ఠాత్మక సంస్థల ఏర్పాటు జరుగుతుండడం పట్ల సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. అక్షర విద్యాలయంలో చిన్నారుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తున్నారని, వెంకటాచలం మండలం ఎర్రగుంట సమీపంలోని అక్షర విద్యాలయంలో సీబీఎస్ఇ 7వ అథ్లెటిక్స్ మీట్ 2025-26 జరగడం హర్షదాయకమని అన్నారు. ఆంధ్ర- తెలంగాణాల నుంచి 2700 మంది విద్యార్థులు, 400 మంది కోచ్‌లు ఈ పోటీలకు హాజరుకావడం ఆనందదాయకమన్నారు. గతంలోనూ ఖోఖో, బాస్కెట్‌బాల్ పోటీలకు అక్షర విద్యాలయం ఆతిథ్యమిచ్చిందని, ఇక్కడ నిర్వహించిన పోటీల్లో రాణించిన విద్యార్థులు జాతీయస్థాయి పోటీల్లోనూ పాలుపంచుకున్నారని ఆయన గుర్తుచేశారు. ‘మా పెద్దాయన.. ముప్పవరపు వెంకయ్యానాయుడు, ఆయన కుమార్తె దీపా వెంకట్ సారథ్యంలో అక్షర విద్యాలయం, స్వర్ణభారత్ ట్రస్ట్ ఒక బ్రాండ్‌గా నిలుస్తున్నాయని’ అన్నారు. జాతీయస్థాయి సంస్థలకు చిరునామాగా సర్వేపల్లి నియోజకవర్గాన్ని మార్చిన ఘనత వెంకయ్యానాయుడుదేనన్నారు. ఎన్‌సిఇఆర్‌టీని మన ప్రాంతానికి తెచ్చారని, రూ.900కోట్లతో ఈ సంస్థ ఏర్పాటు కాబోతోందని తెలిపారు. స్వర్ణ చతుర్భుజి పథకంలో భాగంగా దేశంలోనే మొదటిసారిగా నెల్లూరు-చెన్నై మధ్య జాతీయ రహదారిని నిర్మింపజేసిన గొప్పతనం కూడా మన వెంకయ్యదేనన్నారు.

# రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం


**• ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి**



తెలుగుదేశం పార్టీ జెండాలోనే నాగలి వుందని, రైతు సంక్షేమం కోసం పాటు పడడం తెలుగుదేశం పార్టీ సిద్ధాంతమని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చెప్పారు. ‘అన్నదాత సుఖీభవ’ అమలుతో గ్రామాలలో పండుగ వాతావరణం కనిపిస్తోందన్నారు. ఇటీవల కోవూరులోని పీవిఆర్ కల్యాణమండపంలో నిర్వహించిన అన్నదాత సుఖీభవ పథకాన్ని ఆమె జిల్లా కలెక్టర్ ఆనంద్‌తో కలిసి ప్రారంభించారు. పిఎం కిసాన్‌యోజన, అన్నదాత సుఖీభవ పథకాలను ఉద్దేశించి ప్రధాని నరేంద్ర మోడి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుల సందేశాలను ఆమె అధికారులు, నాయకులతో కలిసి మెగా స్క్రీన్ పై తిలకించారు. అనంతరం ప్రధాని మోడి, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు ధాన్యాభిషేకం చేశారు. ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ, రైతులకు సహాయం చేయడం భారం కాదు.. బాధ్యతగా గుర్తించిన మానవతావాది ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడని కొనియాడారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా కోవూరు నియోజకవర్గంలో 16,938 మంది రైతుల అకౌంట్లలో 11 కోట్ల 6లక్షల 94వేల రూపాయలు జమ అయ్యాయన్నారు. గతంలో ధాన్యం అమ్మిన డబ్బుల కోసం రైతులు ఉద్యమాలు చేయాల్సిన పరిస్థితి వుండేదని, కూటమి ప్రభుత్వం వచ్చాక 48 గంటల్లోనే ధాన్యం డబ్బులు చెల్లించామన్నారు. వ్యవసాయ అధికారిణి అనిత, కోవూరు తహశీల్దారు సుబ్బయ్య, పెన్నాడెల్టా ఛైర్మెన్ జెట్టి రాజగోపాలరెడ్డి, బుచ్చి మున్సిపల్ ఛైర్‌పర్సన్ మోర్ల సుప్రజ తదితరులు పాల్గొన్నారు.

# సోమిరెడ్డి చొరవతో..కండలేరు కాలువకు జలకళ

కండలేరు జలాశయంలో నీటిమట్టం తగ్గపోవడంతో ఎడమ కాలువలో కొద్ది రోజులుగా నీటి ప్రవాహం ఆగిపోయింది. దీంతో ఆయా ప్రాంతాల్లోని వరిపైర్లు, నిమ్మతోటలకు నీరు కరువైంది. పశువులకు తాగునీటి కోసం రైతులు కష్టాలు పడాల్సి వచ్చింది. ఈ సమస్యను పొదలకూరు మండల టీడీపీ నాయకుల ద్వారా ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తెలుసుకుని కండలేరు ఎడమ కాలువ లిఫ్ట్‌కు విద్యుత్ సరఫరాను అందించే ట్రాన్స్‌ఫార్మర్ పిడుగుపాటుకు గురవడంతో తలెత్తిన సాంకేతిక సమస్యలను అధికారులతో చర్చించారు. ఈ సమస్యను ఇటీవల డీఆర్సీ సమావేశంలో సోమిరెడ్డి ప్రత్యేకంగా ప్రస్తావించ



డంతో కలెక్టర్ ఆనంద్ నిధులు మంజూరు చేశారు. యుద్ధప్రాతిపదికన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడంతో పాటు మోటార్లకు సర్వీస్ చేయించిన అధికారులు ఇటీవల కాలువకు లిఫ్ట్ ద్వారా నీటిని విడుదల చేయడంతో రైతులు సంతోషపడుతూ, ఎమ్మెల్యే సోమిరెడ్డికి ధన్యవాదాలు తెలియజేశారు. కాలువకు నీటి విడుదల కార్యక్రమంలో ఎడమకాలువ రైతులు, టీడీపీ పొదలకూరు మండల అధ్యక్షుడు తలచీరు మస్తాన్‌బాబు, పట్టణ అధ్యక్షుడు బొద్దులూరు మల్లికార్జునాయుడు, నాయకులు పెంచల భాస్కర్‌రెడ్డి, శరత్, వెంకటరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




# అవయవ దాతలంటే.. ప్రాణదాతలే

అవయవ దాతలంటే.. ప్రాణదాతలేనని, అవయవదానంపై అపోహలు వీడి, ప్రతి ఒక్కరూ అవయవదానం చేసి ప్రాణదాతలు కావాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ పిలుపునిచ్చారు. ఈనెల 3న, జాతీయ అవయవ దాన దినోత్సవాన్ని పురస్కరించుకొని నెల్లూరులోని జీవన్‌ధాన్ సంస్థ, అపోలో, మెడికవర్, కిమ్స్, నారాయణ, ఏసీఎస్ఆర్ హాస్పిటల్స్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక విఆర్సీ సెంటర్ నుంచి కస్తూరిబా కళాక్షేత్రం వరకు వాక్‌థాన్ కార్యక్రమం నిర్వహించారు. నగరపాలక సంస్థ కమీషనర్ ఓ.నందన్, జీవన్‌ధాన్ చీఫ్ ట్రాన్స్‌ప్లాంట్ కో-ఆర్డినేటర్ డాక్టర్ రాంబాబు, అపోలో హాస్పిటల్ డైరెక్టర్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ శ్రీరామ్ సతీష్, మెడికవర్ హాస్పిటల్ క్లస్టర్ హెడ్ రంజిత్‌రెడ్డి, కిమ్స్ హాస్పిటల్ సీఈఓ డాక్టర్ సతీష్, నారాయణ హాస్పిటల్ ఏజీఎం ఏసీ శేఖర్‌రెడ్డి తదితరులతో అవయవదానంపై ప్రజల్లో అవగాహన కల్పించారు. అనంతరం కస్తూరిబా కళాక్షేత్రంలో జరిగిన అవగాహనా కార్యక్రమంలో కలెక్టర్ అవయవదానం విశిష్టతను వివరించారు. ఒక జీవన్మృతుని అవయవ దానంతో 8 మంది ప్రాణాలు కాపాడవచ్చున్నారు. జీజీహెచ్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.మాధవి, పలు ఆసుపత్రుల వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మంత్రి నారాయణ నివాసంలో..
# వరలక్ష్మీ వ్రత పూజలు



రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ నివాసంలో ఇటీవల శ్రావణమాస శోభ నెలకొంది. వరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకుని పూజగదిని అలంకరించిన మంత్రి సతీమణి పొంగూరు రమాదేవి భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీవ్రత పూజలు నిర్వహించారు. విష్ణుసహస్ర నామ పారాయణం, లక్ష్మీ అష్టోత్తర నామావళి, కుంకుమార్చనలతో విశేష పూజలు చేశారు. గత ఎన్నికల్లో మంత్రి నారాయణ అఖండ విజయంలో భాగస్వాములైన సిటీ నియోజకవర్గ నేతలను, కార్యకర్తలను సతీసమేతంగా ఆహ్వానించి పసుపు కుంకుమలు, నూతన వస్త్రాలను అందచేశారు. ప్రజలందరిపై అమ్మవారి ఆశీర్వాదం ఉండాలని కోరుకున్నామని ఆమె చెప్పారు. టీడీపీ, జనసేన, బీజేపిలకు చెందిన మహిళలు పాల్గొన్నారు.

# నగరంలో.. 30 పోలీస్ యాక్ట్

శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ఈనెల 31వ తేదీ వరకు నెల్లూరు నగరంలో 30-పోలీస్ యాక్ట్‌ను అమలుచేస్తున్నట్టు నగర డిఎస్పీ పి.సింధుప్రియ ఈనెల 4న ఒక ప్రకటనలో తెలిపారు. అనుమతులు లేకుండా సమావేశాలు, ర్యాలీలు నిర్వహించడం, ప్రజలు గుమికూడడం వంటివి చేయకూడదని, నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆమె స్పష్టం చేశారు.






# నెల్లూరు కబుర్లు

# సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్‌ని వాడకండి

## రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఛైర్మన్ డా. కృష్ణయ్య



ఒకేసారి వాడి పారేసే (సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్)ను వాడవద్దని, పర్యావరణానికి హానికలిగించే ఆ ప్లాస్టిక్‌ని పూర్తిగా తొలగించేందుకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ డాక్టర్ పి. కృష్ణయ్య కోరారు. ఈనెల 4న నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ నియంత్రణ గురించి జిల్లా కలెక్టర్ ఆనంద్‌తో కలసి జిల్లా అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. అక్టోబర్ 2వతేదీ నాటికల్లా సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను పూర్తిగా తొలగించాలని ముఖ్యమంత్రి ఆశయమని, అందుకనుగుణంగా అధికారులందరూ కృషిచేయాలని ఆయన చెప్పారు. ఈ ప్లాస్టిక్ వినియోగం సమాజానికి మహమ్మారిలా తయారైందని, దీనిని నిరోధించకపోతే భవిష్యత్తు రోగ గ్రస్తమవుతుందన్నారు. ప్లాస్టిక్ సంచులకు ప్రత్యామ్నాయంగా చేతి సంచులను తక్కువ ధరకు అందించగలిగినప్పుడే ఇది విజయవంతం అవుతుందన్నారు. అందుకోసం మెప్మా ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల ద్వారా తక్కువ ధరకు దొరికే సంచుల తయారీకి చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో డిపిఒ శ్రీధర్ రెడ్డి, డీటీసీ చందర్, డీఎస్ఓ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అవయవదానంతో..మరికొందరికి పునర్జన్మ



డాక్టర్ రజనీకాంత్

ఒకరి అవయవదానంతో మరికొందరికి పునర్జన్మని ప్రసాదించవచ్చని చెన్నై-గ్లెనిగల్స్ హెల్త్‌సిటీలోని ప్రముఖ వైద్యులు.. లివర్ ప్లాంటేషన్ సర్జన్ డాక్టర్ రజనీకాంత్ చెప్పారు. నెల్లూరుకి ఆయన ప్రతినెలా మొదటివారం వచ్చి, లివర్ వ్యాధిగ్రస్తులకు చికిత్సలు చేస్తుంటారు. ఈ సందర్భంగా ఆయన ఈనెల 5న అవయవదానం గురించి అవగాహన కల్పిస్తూ, లివర్ ఫిరోసిస్ వ్యాధిగ్రస్తులకు లివర్‌మార్పిడి పునర్జన్మనిస్తుందని, జీవన్మృతుడి నుంచి లివర్‌ను సేకరించి వ్యాధిగ్రస్తునికి అమర్చవచ్చని తెలిపారు. మనదేశంలో లివర్ సిర్రోసిస్ వ్యాధిగ్రస్తులు అధికమవుతున్నారని, లివర్ మార్పిడి చేయించుకోకపోతే మరణించే ప్రమాదం ఎంతైనా ఉందని ఆయన అంటూ, ఈ పరిస్థితుల్లో అవయవదానం చేసే దాతల సహకారం అవసరమన్నారు. నెల్లూరులో దాదాపు 50మందికి తాము లివర్‌మార్పిడి చేశామని, ఇప్పుడందరూ ఆరోగ్యవంతంగా ఉన్నారని ఆయన తెలిపారు.

## స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను
# ఘనంగా నిర్వహించాలి

ఆగస్టు 15న 79వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయవలసిందిగా సంబంధిత శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. ఈనెల 4న కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో స్వాతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ , ఆ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఎవరికి కేటాయించిన విధులను వారు భాధ్యతతో నిర్వహించాలన్నారు. అందరు అధికారులు సమన్వయంతో కలిసికట్టుగా పనిచేయాలన్నారు.

పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే వేడుకలతో పాటు జిల్లాలోని అన్ని విద్యాసంస్థల్లో పండుగ వాతావరణంలో స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగేలా విద్యా శాఖాధికారులు కృషి చేయాలన్నారు.

అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ఏర్పాటు చేసే శకటాల ప్రదర్శన వినూత్నంగా ఉండేట్లుగా చూడాలన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ కార్తీక్, డిఆర్ఓ హుస్సేన్ సాహెబ్, ఆర్డీఓ అనూష తదితరులు పాల్గొన్నారు.

## పార్టీలకు అతీతంగా..
# కలసి పనిచేద్దాం రండి!

## రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పిలుపు



గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల అభివృద్ధికి పార్టీలకు అతీతంగా కలసి పనిచేద్దామంటూ నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఒకటికి మూడుసార్లు తనను ఏకధాటిగా భారీ మెజారిటీతో గెలిపించి, తనను కుటుంబ సభ్యుడిగా నెల్లూరు గ్రామీణ నియోజకవర్గం ప్రజలు ఆదరించారని ఆయన అంటూ, ఆ ప్రజల అభివృద్ధికి తాను కట్టుబడి పనిచేస్తున్నానన్నారు. ఎన్నికలు ఉన్నా, లేకున్నా నిరంతరం ప్రజలమధ్యనే తాను, తన తమ్ముడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి ఉంటామని స్పష్టం చేశారు. ఇటీవల ఆయన నెల్లూరురూరల్ నియోజకవర్గ పరిధిలోని పాతవెల్లంటి గ్రామంలో 15 లక్షల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నెల్లూరు రూరల్ నియోజకవర్గ అభివృద్ధికి ఏ పని అడిగినా అందుకు వెంటనే అనుమతులు ఇస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి నెల్లూరు రూరల్ నియోజకవర్గ ప్రజలపక్షాన ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు. మండలపరిషత్ అధ్యక్షుడు బూడిద విజయ్‌కుమార్, టీడీపీ నాయకులు ఇందుపూరు శ్రీనివాసులురెడ్డి, నెల్లూరు రూరల్ తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ పముజుల ప్రదీప్, మురళీరెడ్డి, అల్లాభక్షు తదితరులు పాల్గొన్నారు.

# జగన్ నెల్లూరు పర్యటన విజయవంతం

## వైకాపా నేతలు స్పష్టీకరణ



జగన్ నెల్లూరు పర్యటన విజయవంతమైందని వైకాపా నెల్లూరు నేతలు చెప్పారు. స్థానిక వైకాపా జిల్లా పార్టీ కార్యాలయంలో వైకాపా జిల్లా పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మాజీఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, నేతలు ఆనం విజయ్‌కుమార్‌రెడ్డి, మేరగ మురళి, కాకాణి పూజిత తదితరులు మాట్లాడుతూ, ఇటీవల జగన్ పర్యటనలో అడుగడుగునా ఆటంకాలు కల్పించారని, అభిమానులను అడ్డుకోవడానికి జేసీబీలతో రోడ్లను తవ్వారని, అయినా నిర్బంధాలను అధిగమించి జగన్ పర్యటనకు వేలాదిగా అభిమానులు తరలివచ్చారని అన్నారు. జగన్ పర్యటనను అడ్డుకునేందుకు చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా ప్రజలు వాటిని తిప్పికొట్టారని, ఆయన పర్యటనను విజయవంతం చేశారని వారు స్పష్టం చేశారు.

## వివేకానంద వాకర్స్ ఆధ్వర్యంలో..
# స్నేహితుల దినోత్సవం



అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఇటీవల స్థానిక వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అసోసియేషన్ సభ్యుడు బెజవాడ సునీల్‌రెడ్డి సహకారంతో సుమారు 500 మంది వాకర్స్‌కు ఫ్రెండ్‌షిప్ బ్యాండ్స్, స్వీట్స్ పంపిణీ చేశారు. అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ స్వర్ణ రమేష్ బాబు మాట్లాడుతూ, స్నేహానికి కులమతాల భేదం లేదని, పేద, ధనికుల తేడా లేకుండా చేసేదే స్నేహమని, జీవితంలో మనం సంపాదించుకొనే గొప్ప బంధం స్నేహమని అన్నారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ పొన్నం రవిచంద్ర, కోశాధికారి జీకే గోపీనాథ్, వాకర్స్ మాజీ గవర్నర్ రాఘవేంద్రషెట్టి, డీవీ సుబ్బరాజు, సుబ్బరాజు,జయదేవ్, కేవీఎంకే రెడ్డి, గోపాలరెడ్డి, నలుబోలు బలరామయ్యనాయుడు, సుబ్బారామిరెడ్డి, చంద్రమౌళి, ఖలీల్ బేగ్, అంకిరెడ్డి, ఆరి ప్రసాద్, బుర్రా వెంకటేశ్వర్లు, ఎన్వి సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

# దేశంలోనే విశిష్ఠ ఖ్యాతి సాధించిన.. ఐఐఐటీ-శ్రీసిటీ

## • స్నాతకోత్సవంలో రాష్ట్రప్రభుత్వ సలహాదారు డాక్టర్ జి.సతీష్‌రెడ్డి



ప్రపంచ ప్రఖ్యాతి చెందిన శ్రీసిటీ పారిశ్రామికకేంద్రం ఆధ్వర్యంలో ఐఐఐటీ వంటి జాతీయ విద్యాసంస్థ ఏర్పాటు కావడం, దేశంలోనే ఓ విశిష్ట నమూనాగా విఖ్యాతి సాధించడం అపూర్వమని డీఆర్‌డీఓ మాజీ చైర్మన్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ గౌరవ సలహాదారు (ఏరోస్పేస్ మరియు డిఫెన్స్) డాక్టర్ జి.సతీష్‌రెడ్డి ప్రశంసించారు. ఐఐఐటీ-శ్రీసిటీ 2025 (9వ బ్యాచ్) స్నాతకోత్సవం ఇటీవల శ్రీసిటీలో ఘనంగా నిర్వహించారు. ఐఐఐటీ-శ్రీసిటీ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం.వి.కార్తికేయన్ ఈ సందర్భంగా మొత్తం 318మంది విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జి.సతీష్‌రెడ్డి ముఖ్య అతిథిగా, గవర్నింగ్ బోర్డు సభ్యులు శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, ఐఐటీ-తిరుపతి డైరెక్టర్ డాక్టర్ కెవిఎన్ సత్యనారాయణ, ఇతర సెనేట్ సభ్యులు, అధ్యాపకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ సతీష్‌రెడ్డి మాట్లాడుతూ, "ఐఐఐటీ-శ్రీసిటీ కోయంబత్తూర్ టెక్స్‌టైల్ క్లస్టర్ లాంటి పర్యావరణ వ్యవస్థను కలిగివుందని, ఇక్కడ విద్యాసంస్థ మరియు పరిశ్రమ కలిసి అభివృద్ధి చెందుతాయని అన్నారు. ఈ ప్రయోజనాన్ని ఉపయోగించుకొని, 'వికసిత్ భారత్'ను నిర్మించడంలో అందరూ భాగస్వామ్యులు కావాలని ఆయన విద్యార్థులకు సూచించారు. ఆవిష్కరణ, పరిశోధన, పరిశ్రమ స్థాపన దిశగా విద్యార్థులందరూ ముందుకు సాగాలన్నారు. శ్రీసిటీ తరహా పారిశ్రామిక కేంద్రాలకు మద్దతుగా పలు జాతీయసంస్థలు అధునాతన ఆర్‌అండ్‌డీ సౌకర్యాలు, పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సీఈఓ డాక్టర్ శ్రీధర్ వెంబు వర్చువల్‌గా మాట్లాడుతూ, ఐఐఐటీ-శ్రీసిటీ సుస్థిర వృద్ధిని కొనియాడారు. అనంతరం, 2024-25 సంవత్సరానికి సంబంధించిన వార్షిక నివేదికను ప్రొఫెసర్ కార్తికేయన్ సమర్పించారు. కంప్యూటర్ సైన్స్ మరియు ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగాల్లో 309 మందికి బీటెక్ పట్టాలను, 9 మందికి పీహెచ్‌డిలను ప్రదానం చేశారు. వారిలో 18 మంది రీసెర్చ్ స్కాలర్స్‌కు పట్టాలు ప్రదానం చేయగా, మరో ముగ్గురు విద్యార్థులకు బంగారు పతకాలను బహుకరించారు.



## విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ట్రిపుల్ ఐటీ-శ్రీసిటీ 9వ స్నాతకోత్సవం సందర్భంగా అసోసియేట్ డీన్(పూర్వ విద్యార్థి) సారథ్యంలో 2025వ సంవత్సర విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ప్రస్తుత గ్రాడ్యుయేట్లు, మునుపటి బ్యాచ్‌ల విద్యార్థులు పాల్గొని తమ అనుభవాలను పంచుకున్నారు. డైరెక్టర్ ప్రొ.ఎంవి కార్తికేయన్, రిజిస్ట్రార్, డీన్ సహా అధ్యాపక బృందం పూర్వవిద్యార్థులను అభినందిస్తూ, కళాశాలతో వారు తమ అనుబంధాన్ని కొనసాగించాలని సూచించారు. ఈ సందర్భంగా ట్రిపుల్ ఐటీ-శ్రీసిటీ కమ్యూనిటీ స్ఫూర్తిని తెలియజేస్తూ, పలువురు పూర్వ విద్యార్థులు వ్యక్తిగతంగా, వర్చువల్‌గా పాల్గొన్నారు. ఈ సమావేశంలో భాగంగా, ట్రిపుల్ ఐటీ-శ్రీసిటీ పూర్వ విద్యార్థుల నెట్‌వర్క్‌ను ప్రారంభించారు. ఇందులో 2025వ సంవత్సరం వరకు, ప్రతి బ్యాచ్ నుండి ఇద్దరు ప్రతినిధులను (పూర్వ విద్యార్థులు) కళాశాలతో సంబంధాలను బలోపేతం చేయడానికి మరియు విద్యావేత్తలు, పరిశోధనలు, పరిశ్రమలలో సహకారాన్ని ప్రోత్సహించడానికి నియమించారు. సాంస్కృతిక కార్యక్రమాలు, ఫోటో సెషన్‌లతో సమావేశం వేడుకగా జరిగింది.

# రైతుల మేలు కోరే.. 'అన్నదాత సుఖీభవ'

## ఎమ్మెల్యే కాకర్ల సురేష్



రైతు సంక్షేమమే ధ్యేయంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు పెట్టుబడిసాయంగా అన్నదాతా సుఖీభవ - పీఎం కిసాన్ పథకాన్ని అమలు చేస్తున్నాయని ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ చెప్పారు. ఇటీవల ఆయన వింజమూరులోని సచివాలయం ప్రాంగణంలో అన్నదాత సుఖీభవ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకం ద్వారా 46.5 లక్షల రైతన్నలకు రూ.2325 కోట్ల లబ్ది చేకూరిందన్నారు. మన జిల్లాలో అన్నదాత సుఖీభవ మొదటి విడతలో మొత్తం 1,95,866మంది రైతులకు ఒక్కొక్కరికి రూ.5,000 చొప్పున మొత్తం 97.933 కోట్లు రూపాయలు ఆర్థిక సహాయం లభించిందని తెలిపారు. అదే విధంగా పియం కిసాన్ 20వ విడత కింద జిల్లా వ్యాప్తంగా 1,68,350 మంది రైతులకు ఒక్కొక్కరికి రూ.2వేల చొప్పున 33.67 కోట్ల రూపాయలు ఆర్థిక సహాయం లభించనుందన్నారు. మొత్తంగా వీటి ద్వారా రైతులకు ఏడాదికి 20వేల వంతున ప్రయోజనం లభిస్తుందన్నారు. 2025-26 సంవత్సరానికి సంబంధించిన ఉదయగిరి నియోజకవర్గంలో అన్నదాత సుఖీభవ సుమారు 44వేల మందికి 30.42కోట్లు లబ్ది చేకూర్చిందన్నారు. నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, జేసీ కే.కార్తీక్, ఆర్డీవో వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# సోషల్ మీడియా మాయలో పడొద్దు

## • యువతకు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి పిలుపు

సోషల్ మీడియా మాయలో పడి సమయాన్ని నిరుపయోగం చేసుకోవద్దని, క్రమశిక్షణను అలవరచుకుని ఉత్తమంగా రాణించాలని యువతకు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పిలుపునిచ్చారు. ఇటీవల ఆమె బుచ్చిరెడ్డిపాళెంలోని డివిఎల్‌ఎన్‌ఆర్ హైస్కూల్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి కబడ్డీ టోర్నమెంట్ ప్రారంభోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, క్రీడలు మానసిక వికాసానికి, శారీరక దృఢత్వానికి దోహదం చేస్తాయని, యువత క్రీడలపై మక్కువ పెంచుకోవాలని చెప్పారు. క్రీడలలో రాణించాలంటే శారీరక శక్తి మాత్రమే కాదు, సహనం, తమతో ఉన్న ఆటగాళ్లను కలుపుకుపోయే నాయకత్వ లక్షణాలు కలిగి వుండాలన్నారు. ఒకవేళ ఓడిపోయినా, ఆ ఓటమి గెలుపుకు పాఠం కావాలని, అదే విజయానికి సోపానం కావాలని క్రీడాకారుల్లో ఆమె స్ఫూర్తిని కలిగించారు. కబడ్డీ క్రీడాకారులను ప్రోత్సహించి జిల్లా స్థాయి టోర్నమెంట్ నిర్వహిస్తున్న నిర్వాహకులను ఆమె అభినందించారు. బుచ్చిరెడ్డిపాళెం మున్సిపల్ ఛైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, వైస్‌ఛైర్మెన్లు యరటపల్లి శివకుమార్ రెడ్డి, పఠాన్ నస్రీన్, కౌన్సిలర్లు, స్థానిక టిడిపి నాయకులు పాల్గొన్నారు.

# నృత్య, గానాలతో అలరించిన అనంత్ 'కళాంజలి'

## • ముగ్గురు ప్రతిభావంతులకు అవార్డులు




నెల్లూరులోని కళాంజలి సాంస్కృతిక సంస్థ నిర్వాహకుడు అనంత్ ఆధ్వర్యంలో ఈనెల3న స్థానిక టౌన్‌హాలులో నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం ఆద్యంతం వీనులవిందుగా సాగింది. 'పాడుతా తీయగా' గాయనీ గాయకులు తమ మధుర గానాలాపనలతో ప్రేక్షకులను అలరించారు. పాత-కొత్త పాటల కలయికతో 'స్వరఝరి' అందరి కరతాళధ్వనులందుకుంది. 'పాడుతా తీయగా' రన్నరప్, తెలుగు ఇండియన్ ఐడల్ గాయని కుమారి కీర్తన (కాకినాడ) ఆలపించిన 'కన్నులతో చూసేదీ గురువా'.. వంటి సినీగీతాలు.. 'నిగమా నిగమాంతరంగ' వంటి అన్నమయ కీర్తనలు కీర్తన గానప్రతిభకు నిదర్శనమయ్యాయి. ఈ కార్యక్రమంలో కీర్తనకి 'స్వరరాగమయి' బిరుదునిచ్చి సత్కరించారు. అదేవిధంగా, ప్రముఖ సినీ రచయిత డా.రాజేంద్రకుమార్‌ని 'అక్షరయోధుడు', సినీ సంగీత దర్శకులు జయ్‌క్రిష్‌ని 'సంగీత రత్న' బిరుదులతో సన్మానించారు. ఆత్మీయ అతిథులుగా పాల్గొన్న 'లాయర్' పత్రికా సంపాదకులు తుంగా శివప్రభాత్‌రెడ్డి, కళాంజలి గౌరవాధ్యక్షుడు వీరిశెట్టి హజరత్‌బాబు, నలుబోలు బలరామయ్య నాయుడు, ఎం.ప్రసన్నాంజనేయులు, దేవరాల సుబ్రహ్మణ్యం తదితరుల చేతుల మీదుగా ఈ అవార్డులను బహుకరించారు. 'స్వరఝరి'లో ప్రముఖ గాయనీ గాయకులు కీర్తన, నరసింహ, జ్ఞానశ్రీ, అనూష, గాయత్రి, కృష్ణయ్య పాల్గొనగా, దారా సురేష్, తబలా శాంతికుమార్, ఖాదర్‌బాషా, విజయ్, గిరి వాద్య సహకారం అందించారు.

కళాంజలి అనంత్ మాట్లాడుతూ, తమకు మార్గదర్శకులైన స్వర్గీయ తుంగా రాజగోపాల్‌రెడ్డి పేరుతో ఏటా ఒక అవార్డును రంగస్థల రంగ ప్రముఖులకు ఇవ్వాలని భావిస్తున్నామని, అందుకు ఆయన తనయులైన తుంగా శివప్రభాత్‌రెడ్డి అనుమతి నివ్వాలని కోరారు. అనంతరం, శివప్రభాత్‌రెడ్డి మాట్లాడుతూ, తమ తండ్రిగారి పేరుతో వారి శిష్యులు చేసే కార్యక్రమాలకు తమ అనుమతి అవసరం లేదని అంటూ, కళాంజలి సంస్థ బహుకరించే ఆ రంగస్థల అవార్డుకు తమవంతు సహకారంగా ఏటా 10వేల రూపాయలను ఇస్తామని ప్రకటించారు. ఈ పదివేలని అవార్డు గ్రహీతకు అందజేయవలసిందిగా సూచించారు. ఆ అవార్డుకు వారు కోరుకున్నట్లుగా 'తుంగా రాజగోపాలరెడ్డి అవార్డు' అని పేరు పెట్టుకోవచ్చన్నారు. కళాంజలి కార్యక్రమాలను మెచ్చుకుంటూ, అవోపా అధ్యక్షురాలు శ్రీరాం శైలజ 10వేల రూపాయలను ఆ సంస్థకు బహుకరిస్తున్నట్లు ప్రకటించారు. రెడ్‌క్రాస్ ఛైర్మెన్ వాకాటి విజయకుమార్ రెడ్డి, మురళీకృష్ణ హోటల్స్ గ్రోసు సుబ్బారావు, ప్రముఖ కవి చిన్ని నారాయణ రావు, హైటెక్ ఫార్మా డా.ఎన్‌వి రమణా రెడ్డి, శుభమస్తు షాపింగ్‌మాల్ అధినేత బయ్యా రవికుమార్ తదితరులు ఈ కార్యక్రమానికి సహకరించారని అనంత్ తెలిపారు.

వ్యాఖ్యాతలు దువ్వూరు బెనర్జీ, ఏవీ రామకిషోర్‌తో పాటు కృష్ణకుమార్, బిల్లీ శ్యాంసన్, సురేష్ తదితరుల పర్యవేక్షణలో ఈ కార్యక్రమం అందరినీ ఆకట్టుకుంది.






# ప్రవచనమే... ద్విపాత్రాభినయమైతే!

ఒకరేమో పువ్వులపై నడిపిస్తూ..
మరొకరేమో నవ్వులతో తడిపేస్తూ..

ఒకరేమో విషయాన్ని ముక్కుసూటిగా..
మరొకరేమో అటు తిప్పి ఇటు తిప్పి అక్కడికే..

ఒకరేమో అలౌకిక ప్రపంచవిహారం..
మరొకరేమో లౌకికప్రపంచ సంచారం..

ఒకరేమో నేరుగా విశ్వేశ్వరుని సన్నిధికి..
మరొకరేమో విశ్వం మొత్తం తిప్పి అలా అదే సన్నిధికి..

ఒకరేమో విచ్చుకునే అంతరంగం..
మరొకరేమో టింగురంగం..

ఒకరేమో పంచె.. లాల్చీ..కండువా..
మరొకరేమో అదే పంచె.. ఆపై కోటు..

ఒకరేమో నిరాడంబరం..
మరొకరేమో గండపెండేరం..

ఇద్దరి కథా ఆధ్యాత్మికతే..
ఒకే లక్ష్యం..ఒకటే గమ్యం..
విషయం అదే.. చెప్పే తీరు వేరు..

చాగంటి గుడిగంట..
గరికపాటి ఆ గుడిలో హోమం మంట..

రామాయణమైనా.. భారతమైనా..
భాగవతమైనా.. శివపురాణమైనా..
కార్తీక పురాణమైనా..

చాగంటి చెబితే తన్మయం..
గరికపాటి పలికితే విస్మయం..
ఒకరు వివరిస్తే
ఇదే ప్రపంచమని అనిపిస్తుంది..
మరొకరు సవరిస్తే
ఇదా ప్రపంచమని అనిపిస్తుంది..

ఇద్దరూ ప్రవచనకర్తలే..
ఒకరేమో పరవశకర్త..
మరొకరేమో తన వశకర్త..!

ఇద్దరూ మహాపండితులే..
పూజ్యులు..మాన్యులు.. మించి ధన్యులు..!

ఇద్దరి ధారణ అసాధారణం..
మాటల మూటలు..
విషయ పరిజ్ఞానం సాగర పర్యంతం..
ధాటి అనంతం..
మాటాడుతుంటే గుడిగంటల సవ్వడి వోలె
గంటలు గంటలు.. వినాల్సిందే ఆసాంతం..!

ఒకరేమో భగవంతునికి
నిన్నటి ప్రపంచపు ఉత్తరం..
మరొకరేమో నేటి లోకపు ప్రత్యుత్తరం..
ఇద్దరి కీర్తీ లోకోత్తరం..!

ఇద్దరిదీ ప్రియవచనం..
ఇద్దరూ ప్రవచనానికి బహువచనం..!..

రెండు మేరునగాలను ఒక దరి చేర్చి
ఎంచి.. పోల్చి చూపే ప్రయత్నం చేశాను.

**అంటూ.. ఒక అద్భుతమైన విశ్లేషణాత్మక కవితను ఓ అజ్ఞాత కవి రాశారు. సామాజిక మాధ్యమంలో వైరల్ అవుతున్న ఆ కవితను పాఠకులకు అందిస్తోంది 'లాయర్'.**

# స్వయం సమృద్ధే ట్రంప్‌కి సమాధానం

మనసులో మాట 57

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో సారి భారత్‌పై తన అక్కసు వెళ్లగక్కడంతో పాటు అన్యాయమైన చర్యకు దిగారు. భారత్ నుంచి అమెరికాకు చేసే ఎగుమతులపై నిన్నగాక మొన్న 25శాతం సుంకాలు విధించిన ఆయన, వాటికి అదనంగా మళ్లీ తక్షణమే సుంకాలు విధిస్తున్నట్లు ప్రకటించారు. రష్యా నుంచి భారత్ చమురు దిగుమతి చేసుకోవడమే ఇందుకు కారణమని ఆయన తన చర్యను సమర్థించుకునే ప్రయత్నం చేశారు.

రష్యా నుంచి చమురు కొనడం వల్ల ఆ దేశానికి డబ్బు సమకూరుతోందని, దాంతో ఆ దేశం ఉక్రెయిన్‌తో యుద్ధం కొనసాగిస్తోందని సుంకాల పెంపునకు కారణం చెప్పారు. ఆయన వాదన అసమంజసం. ఎందుకంటే రష్యా వద్ద చమురు కొనుగోలు చేయాలని ప్రోత్సహించింది అమెరికానే. గల్ఫ్ నుంచి మాత్రమే ఇంధనం కొనకుండా అంతర్జాతీయంగా చమురు మార్కెట్‌ను స్థిరీకరించే వ్యూహంతోనే నాడు అమెరికా రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేసేలా ప్రోత్సహించింది. మరోవైపు అమెరికా, ఐరోపా దేశాలు ఇప్పటికీ రష్యా నుంచి ఎరువులు, ఇతర ముఖ్యమైన రసాయనాలు కొనుగోలు చేస్తున్నాయి. అవి మాత్రం కొంటూ భారత్‌ను మాత్రం వద్దు అనడంలో అర్థం లేదు. ఒక సార్వభౌమ దేశంగా ఎప్పుడు, ఎవరితో వ్యాపారం చేయాలో ఎవరితో చేయకూడదో పూర్తిగా మన ఇష్టం.

ట్రంప్ మరో వ్యాఖ్య కూడా చేశారు. భారత్ ఆర్థిక వ్యవస్థ కుదేలయిపోయిందని (డెడ్ ఎకానమి) అన్నారు. ఆయన భారత్ ఆర్థిక వ్యవస్థను అర్థం చేసుకుని ఆ మాట అన్నారా అన్న అనుమానం వస్తోంది. భారత్ ఇప్పటికే నాలుగో పెద్ద ఆర్థిక వ్యవస్థ. త్వరలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించబోతోందని ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక ఏజెన్సీలన్నీ చెబుతున్నాయి. అమెరికా పౌరులను ఆకట్టుకుని రాజకీయ ప్రయోజనాలు సాధించడం కోసమే ఆయన ఇటువంటి వ్యాఖ్యలు చేస్తూ అర్థంపర్థం లేని చర్యలకు దిగుతున్నారు. ఇలాంటి చర్యలు అంతర్జాతీయంగా వ్యాపార విశ్వాసాన్ని దెబ్బతీస్తాయి అన్న సంగతిని ఆయన విస్మరిస్తున్నారు.

సుంకాల పెంపు వల్ల భారత్‌కు వచ్చే నష్టంతో పోల్చుకుంటే అమెరికాకు వాటిల్లే నష్టమే ఎక్కువ. ఎందుకంటే భారత్ నుంచి అమెరికా దిగుమతి చేసుకునే చాలా వస్తువులు అమెరికాలో తయారు కావు. మనపై సుంకాలు వేస్తే ఆ నష్టాన్ని మనం భరించం. కచ్చితంగా ఆ భారాన్ని అమెరికా పౌరులకే బదలాయిస్తాం. అమెరికాలో వస్తువులు తయారై మనకంటే తక్కువ ధరకు విక్రయిస్తేనే మనకు నష్టం. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ట్రంప్ వేసిన సుంకాలు వాణిజ్య సంబంధాలపై తాత్కాలిక ప్రభావం చూపినప్పటికీ, భారత్‌లో ఉత్పత్తుల విస్తరణ, ఉత్పాదకత పెరుగుదల వంటి అంశాలు దీన్ని సమర్థవంతంగా ఎదుర్కొంటాయి. పైగా, అమెరికాలో భారత్‌కు ప్రత్యామ్నాయంగా తక్కువ ధరలకు సరఫరా చేసే దేశాలు లేవు. దాంతో చివరికి సుంకాల భారం అమెరికా వినియోగదారులపైనే పడుతుంది.

మనం వీలయినంతవరకు అన్ని వస్తువులను ఇక్కడే తయారు చేసుకోగలిగితే అమెరికా, ఇతర దేశాల దిగుమతులపైనా ఆధార పడడం తగ్గి ఇంకా ప్రయోజనం కలుగుతుంది. రిపబ్లికన్ పార్టీకే చెందిన నిక్కీ హేలీ లాంటి వారు కూడా భారత్ పై ట్రంప్ వైఖరి సరికాదని, అది అమెరికా సమాజానికే నష్టం కలిగిస్తుందని హెచ్చరిస్తున్నారు. దీర్ఘకాలిక విశ్వసనీయమైన భాగస్వామి పట్ల ఇలాంటి వైఖరి సబబు కాదని కుండబద్దలు కొట్టి చెప్పారు.

మరోవైపు ప్రధాన ప్రతిపక్షానికి చెందిన అగ్రనాయకుడు రాహుల్‌గాంధీ ట్రంప్ వ్యాఖ్యలను సమర్థించడం ఏ మాత్రం సబబు కాదు. భారత ఆర్థిక వ్యవస్థ కుదేలయిందన్న ట్రంప్ వ్యాఖ్యలను తాను సమర్థిస్తున్నట్లు ఆయన వ్యాఖ్యానించారు. ఇంటిలో ఎన్ని గొడవలైనా ఉండొచ్చు కానీ బయటదేశాలతో మాట్లాడాల్సి వచ్చినప్పుడు ఆచితూచి మాట్లాడాలి. అంతర్జాతీయ వేదికలపై భారత్‌ను సమర్థించడం ప్రతిపక్షాల నుంచి ఆశించే కనీస జవాబుదారీతనం. విదేశీ నేతల విమర్శలకే ఊతమిచ్చే తీరుని ప్రజలు తప్పక గమనిస్తారు. ఆ స్పృహ ఆయనకు ఉన్నట్లు లేదు. అందుకే ఆయన అధికారం సాధించేంతగా ప్రజల మద్దతు పొందలేకపోతున్నారు.

మరోవైపు భారత్, పాకిస్థాన్ మధ్య తానే యుద్ధాన్ని ఆపానని ట్రంప్ మళ్లీ గొప్పలు చెప్పుకుంటున్నారు. ట్రంప్ ప్రమేయం ఏమీ లేదని స్వయంగా భారత్ ప్రధాని నరేంద్రమోదీ చెబుతున్నా ఆయన పాత పాటే పాడుతున్నారంటే నోబెల్ శాంతి బహుమతి కోసం ఆయన ప్రచార యావ ఎంతగా ఉందో అర్థం చేసుకోవచ్చు. తనను శాంతిదూతగా భారత్ అంగీకరించకపోవడం వల్ల ఆయన అహం దెబ్బ తినడం కూడా భారత్‌పై సుంకాలు పెంచడానికి ఒక కారణమయి ఉండొచ్చు. ట్రంప్ వ్యాఖ్యలు, సుంకాల బాదుడు నేపథ్యంలో ప్రధాని మోదీ స్పందిస్తూ అంతర్జాతీయంగా ఆర్థిక పరిస్థితులు అనిశ్చితిలో ఉన్నాయని.. దీనికి ఏకైక విరుగుడు భారతీయులు స్వదేశంలో తయారైన వస్తువులు కొనడమే అని స్పష్టం చేశారు. అంతర్జాతీయ రాజకీయాల్లో విమర్శలు, ఒత్తిడులు సహజమే. కానీ వాటికి సమాధానం చెప్పే తీరు దేశ నాయకత్వ స్థాయిని, పౌరులపై ప్రభుత్వ నమ్మకాన్ని ప్రతిబింబిస్తుంది. మోదీ సానుకూల ధోరణి, నిగ్రహం, దేశ ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇచ్చే వైఖరి అభినందనీయమని చెప్పకతప్పదు.



**తుమ్మల బాల గంగాధర్ తిలక్**




## సౌత్‌మోపూరు సబ్‌స్టేషన్ వద్ద ధర్నా

స్మార్ట్‌మీటర్లపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఈనెల 5న నెల్లూరు రూరల్ మండలం సౌత్‌మోపూరు గ్రామంలో సీపీఎం నాయకులు పెద్దఎత్తున ధర్నాందోళన నిర్వహించారు. పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని, స్మార్ట్‌మీటర్ల ఏర్పాటును నిలిపేయాలని డిమాండ్ చేస్తూ ఆ గ్రామంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట నినాదాలు చేశారు. విద్యుత్ వినియోగదారులకు భారంగా మారే స్మార్ట్‌మీటర్ల వాడకాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ అంగీకరించేది లేదని స్పష్టం చేశారు. తాము అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని, 200యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సౌకర్యం కలిగిస్తామని టీడీపీ నాయకులు హామీ ఇచ్చారని, ఇప్పుడు అధికారంలోకి వచ్చాక మాట మార్చారని నాయకులు ఆలూరు తిరుపాలు, పూడిపర్తి జనార్ధన్ తదితరులు విమర్శించారు. తమను ఆశీర్వదించిన ప్రజలకు మేలుచేయాల్సిన ప్రభుత్వం, నాటి హామీలు మరచిపోయి, రకరకాల పేర్లతో అదనంగా విద్యుత్ చార్జీలను మోపుతుండడం ఏమిటని ప్రశ్నించారు. ఇకనైనా ప్రభుత్వం పునరాలోచించి స్మార్ట్‌మీటర్ల ఏర్పాటును విరమించుకోవాలని, పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని వారు కోరారు.

## నెల్లూరులో సీపీఎం ఆందోళన

ప్రజలకు పెనుభారంగా మారే స్మార్ట్‌మీటర్ల ఏర్పాటు వద్దనే వద్దంటూ నెల్లూరులోని విద్యుత్‌భవన్ వద్ద ఈనెల 5న సీపీఎం, వామపక్ష నాయకులు నిరసన వ్యక్తం చేశారు. స్మార్ట్‌మీటర్లను వ్యతిరేకిస్తూ, అప్పట్లో టీడీపీ నాయకులు ప్రజలకు హామీలిచ్చారని, వాటిని ఏర్పాటుచేస్తే పగలకొట్టాలంటూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పిలుపునిచ్చారని, ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని పెట్టేందుకు సన్నాహాలు చేయడం ఏమిటంటూ సీపీఎం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ప్రభుత్వం ఆ ప్రయత్నాలను విరమించుకోకుంటే ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆమేరకు విద్యుత్‌శాఖ ఎస్ఇకి వినతిపత్రం అందజేశారు. ఈ ఆందోళనలో వామపక్ష సంఘాల నాయకులు మూలం రమేష్, మాదాల వెంకటేశ్వర్లు, రాంబాబు, దామా అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

## కావలిలో 'యాప్'లపై వెల్లువెత్తిన నిరసన

రాష్ట్రప్రభుత్వం అంగన్‌వాడీలకు ఫోన్‌లు ఇచ్చి, యాప్‌ల ద్వారా అదనపు పనిభారం మోపిందంటూ కావలి పట్టణ పరిధిలోని అనేకమంది అంగన్‌వాడీ కార్యకర్తలు ఈనెల 4న నిరసన తెలియజేశారు. కావలి సమీపంలోని ముసునూరు వద్ద ఉన్న అంగన్‌వాడీ ప్రాజెక్టు వద్దకు భారీసంఖ్యలో తరలి వచ్చి తమ ఆవేదన వెలిబుచ్చారు. ఆ ఫోన్లు సరిగా పని చేయడం లేదని, ఎన్నిసార్లు చెప్పినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, వాటివల్ల తాము మానసిక క్షోభను అనుభవిస్తున్నామని బాధను వ్యక్తం చేశారు. తమకు ఆ ఫోన్లు వద్దన్నా, సీడీపీఓ కార్యాలయంలోనివారు వాటిని తీసుకోకపోవడంతో, ఆ సెల్‌ఫోన్లన్నీ ఒక అట్టపెట్టెలో పెట్టేసి వెళ్ళిపోయారు. ఈ నిరసనలో సీఐటియు నాయకులు కృష్ణయ్య, అంగన్‌వాడీ వర్కర్స్ సంఘం నాయకురాళ్లు పాల్గొన్నారు.

## సంగంలో తల్లితండ్రుల ఆందోళన

దువ్వూరు పరిధిలోని తూర్పుపూండ్లకి చెందిన పలువురు విద్యార్థులు, తల్లితండ్రులు ఈనెల 4న ఆందోళన బాట పట్టారు. మండల కేంద్రమైన సంగంలోని తహశీల్దార్ కార్యాలయం వద్దకు వచ్చి, తమ పాఠశాలను వేరొక పాఠశాలలో విలీనం చేయొద్దంటూ నినాదాలు చేశారు. పాఠశాల విలీనం వల్ల పిల్లలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారన్నారు. చిన్నపిల్లలు దూరంగా ఉన్న ఆ పాఠశాలకు వెళ్లలేక బాధపడుతున్నారన్నారు. ప్రభుత్వం, జిల్లా ఉన్నతాధికారులు పరిశీలించి తమ పాఠశాల తామున్న ప్రాంతంలోనే ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఆమేరకు తహశీల్దారుకు వినతిపత్రం అందజేశారు.

# మంత్రి ఆనం ఆధ్వర్యంలో.. విజయవంతంగా జాబ్‌మేళా



- 100 కంపెనీలు..1200 మందికి ఉద్యోగాలు
- నిరుద్యోగుల్లో ఆనందోత్సాహాలు

జిల్లాలోని మెట్టప్రాంత నిరుద్యోగ యువతకు మంచి భవిష్యత్‌ను అందించి, ఆ ప్రాంత సమగ్ర అభివృద్ధికి బాటలు వేయడమే లక్ష్యంగా ఈనెల1న ఆత్మకూరులో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి నేతృత్వంలో నిర్వహించిన మెగా జాబ్‌మేళా విజయవంతమైంది. సుమారు 100 కంపెనీలు పాల్గొని, 1200మందికి ఉద్యోగాలివ్వడం విశేషం. రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంటు కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఆత్మకూరు ఆంధ్రా ఇంజనీరింగ్ కళాశాలలో మంత్రి ఆనం సారథ్యంలో మెగా జాబ్‌మేళాను నిర్వహించారు. తొలుత మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు గుండ్రా సతీష్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ ఆనంద్ ఈ కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం, మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ, కంపెనీల చుట్టూ మనం తిరగడం కాకుండా, కంపెనీలే మన ముందుకొచ్చి ఉద్యోగాలిచ్చేలా మెగా జాబ్‌మేళాకు శ్రీకారం చుట్టామని, జిల్లాలో ఇంతపెద్ద జాబ్‌మేళా గతంలో ఎప్పుడూ జరగలేదని, ఆత్మకూరు చరిత్రలో నిలిచేలా రెండురోజులపాటు ఈ మెగా జాబ్‌మేళాను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సుమారు 3వేలకు పైగా యువతీ యువకులు రిజిస్ట్రేషన్లు చేసుకుని జాబ్ మేళాలో పాల్గొన్నారని చెప్పారు. ఆత్మకూరు నియోజకవర్గంలో రేపటి తరానికి ఒక మార్గం చూపడం కోసం చేసిన ఒక ప్రయత్నమే మెగా జాబ్‌మేళా అని, 1200 మంది యువతీ యువకులకు ఉద్యోగాలు కల్పిస్తూ నియామకపత్రాలు అందజేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ ఆలోచన మేరకు రాష్ట్ర స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ జాబ్ మేళాను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి మంత్రి ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు గుండ్రా సతీష్‌రెడ్డి మాట్లాడుతూ, మంత్రి ఆనం రామనారాయణరెడ్డి గొప్ప సంకల్పంతో ఈ జాబ్‌మేళాకు శ్రీకారం చుట్టారన్నారు. పదేపదే జాబ్‌మేళాపై తనతో మాట్లాడుతూ ఎక్కువ కంపెనీలు వచ్చేలా కృషిచేశారని, అధికారులు, కార్యకర్తలతో సమీక్షలు నిర్వహించి, అందరిని సమన్వయం చేసుకుంటూ అన్నీ తానై ముందుకు నడిపించారని తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు నిర్వహించిన పలు జాబ్‌మేళాల్లో దాదాపు 2వేల మందికి ఉద్యోగాలు కల్పించామని జిల్లా కలెక్టర్ ఆనంద్ తెలియజేశారు. చేరిన ఉద్యోగంలో కష్టపడి పనిచేసి మంచి అనుభవం సాధిస్తే, ఉన్నత పదవులు తప్పక వరిస్తాయని యువతకు ఉద్బోధించారు. ఈ స్ఫూర్తితో జిల్లాలోని మిగిలిన నియోజకవర్గాల్లో కూడా జాబ్ మేళాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ అబ్దుల్ అజీజ్, రాష్ట్ర టిడ్కో ఛైర్మన్ వేములపాటి అజయ్, ఏపీ ఇన్ లాండ్ అథారిటీ ఛైర్మెన్ డా. జడ్ శివప్రసాద్, ఆర్టీసీ జోనల్ ఛైర్మెన్ సన్నపరెడ్డి సురేష్‌రెడ్డి, ఎన్‌డిసిసి బ్యాంకు ఛైర్మెన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి, ఆర్డీవో పావని, తహశీల్దార్ పద్మజ పాల్గొన్నారు.



## నడికుడి నుంచి..
## రైలు ఇంజిన్ ట్రయల్ రన్

ఎట్టకేలకు మెట్ట ప్రాంతాల ప్రజల దశాబ్దాల నాటి కల త్వరలోనే సాకారం కాబోతుంది. ఎంతోకాలంగా నత్తనడకన సాగిన ప్రకాశం జిల్లాలోని నడికుడి–శ్రీకాళహస్తి రైల్వేలైన్ పనులు ఎట్టకేలకు ఊపందుకున్నాయి. ఇప్పటికే కొంత మేరకు రైల్వే లైన్ పూర్తయింది కూడా. ప్రధానంగా భూసేకరణకు ఉన్న అడ్డంకులన్నింటినీ పరిష్కరించడంతో పనులను పూర్తిచేసేందుకు మార్గం సుగమమైంది. కనిగిరి, పామూరు మండలాల మధ్య 50 కిలోమీటర్ల నిర్మాణ పనులు శరవేగంగా పూర్తి చేశారు. తాజాగా రైల్వే అధికారులు నడికుడి నుంచి కనిగిరి ప్రాంతం వరకు రైలు ఇంజిన్ ట్రయల్ రన్ నిర్వహించారు. దీంతో మెట్టప్రాంతాల ప్రజలు తమకు రైలు సౌకర్యం రాబోతోందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

---

## తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

## పింగళి వెంకయ్యకి భారతరత్న ఇవ్వాలి



దేశం గర్వించదగ్గ స్వాతంత్ర సమరయోధుడు, తెలుగువాడు, జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్యకి 'భారతరత్న' ఇచ్చి ఆ మహనీయుని సేవలను గౌరవించాలని భారతీయ శిక్షణ మండల్ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు దేశిరెడ్డి ప్రజేంద్రరెడ్డి పిలుపునిచ్చారు. చిల్లకూరు మండలం పాలిచర్లవారిపాలెం ఉన్నత పాఠశాలలో పింగళి వెంకయ్య 149వ జయంతి వేడుకలు ఇటీవల ఘనంగా నిర్వహించారు. 1876 ఆగస్టు 2న కృష్ణాజిల్లాలోని గట్లపెనుమర్రు గ్రామంలో జన్మించిన పింగళి వెంకయ్య మన దేశానికి జాతీయ పతాకాన్ని రూపకల్పన చేయడం తెలుగువారిగా మనమందరం గర్వించదగ్గ విషయమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పింగళి వెంకయ్య చిత్రలేఖన పోటీ, ఆయన జీవిత చరిత్రపై వ్యాసరచన, ఉపన్యాసాల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి.అనసూయ, చంద్రశేఖర్, మాధవయ్య, లావణ్య, సంధ్య, లీల, నాగభూషణమ్మ, సుగుణ, విద్యుల్లత, రవీంద్ర, డివి రమణయ్య పాల్గొన్నారు.

## ముర్రుపాలే బిడ్డ ఆరోగ్యానికి శ్రేష్టం


**ఐ.సి.డి.ఎస్ సిడిపిఓ మెహబూబి**



తల్లి ముర్రుపాలు పుట్టిన బిడ్డకు ఒక టీకా లాంటిదని, ఆరోగ్యానికి శ్రేష్టంగా వ్యాధి నిరోధక శక్తి పెంచే విధంగా ఉంటాయని గూడూరు ఐసిడిఎస్ సిడిపిఓ మెహబూబీ పేర్కొన్నారు. ఈ నెల 2వ తేదీ గూడూరు మండల పరిధిలోని చెన్నూరు 2వ హరిజనవాడ అంగన్‌వాడి కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సిడిపిఓ పౌష్టికాహారం ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. అనంతరం గర్భవతులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ పి.శివజ్యోతి, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైతుల అభివృద్ధే కూటమి లక్ష్యం

**• ఎమ్మెల్యే పాశిం సునీల్**



రైతుల అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ తెలిపారు. గూడూరు పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఇటీవల జరిగిన 'అన్నదాత సుఖీభవ' నగదు చెక్కుల పంపిణీ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనాతో కలిసి ఆయన పాల్గొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్న ఈ పథకం కింద రైతులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ పంటల స్టాల్స్‌ను ఎమ్మెల్యే అధికారులతో కలిసి పరిశీలించారు. ఏయే పంటలు సాగు చేశారో రైతులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఎమ్మెల్యే సునీల్‌కుమార్ మాట్లాడుతూ.. మొదటి విడతగా రైతుల ఖాతాల్లో ఏడు వేల రూపాయల నగదు జమ చేయడం జరిగిందని, రెండో విడత అక్టోబరు, మూడో విడత నగదు జనవరిలో రైతుల ఖాతాల్లో జమ చేయడం జరుగుతుందని తెలిపారు. వివిధ శాఖల అధికారులు, సొసైటీ అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి, నాయకులు శీలం కిరణ్‌కుమార్, భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచురామయ్య తదితరులు పాల్గొన్నారు.

## కార్యదీక్షాపరుడు ఇలియాస్ అహ్మద్



చిల్లకూరు మండల ఇంజనీరింగ్ అధికారిగా మంచి పేరు తెచ్చుకొని, రాష్ట్ర స్థాయిలో అవార్డు పొందిన షేక్ ఇలియాజ్ అహ్మద్ కార్యదీక్షాపరుడని గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ కొనియాడారు. ఇటీవల గూడూరులోని సిఆర్‌రెడ్డి కళ్యాణ మండపంలో ఇలియాజ్ అహ్మద్ పదవీవిరమణ మహోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై ఇలియాజ్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇలియాస్ సోదరుడు రియాజ్ అహ్మద్, పంచాయతీరాజ్ ఇంజనీర్ల రాష్ట్ర జేఏసీ ఛైర్మన్ మురళీకృష్ణ,ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సుబ్బరాజు, రాష్ట్ర ఇంజనీర్ సంఘ నాయకులు, పెద్ద సంఖ్యలో ఇంజనీర్లు, సర్పంచులు, పెద్ద ఎత్తున ముస్లిం మైనారిటీలు పాల్గొని ఇలియాస్ అహ్మద్‌కు పదవీ విరమణ శుభాకాంక్షలు తెలిపారు. గూడూరు పంచాయతీరాజ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టి.శ్రీనివాసరావు అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు.



## స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలి

స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని కోరుతూ గూడూరు పట్టణం, అశోక్‌నగర్‌లోని 7వవార్డులో సీపీఎం పార్టీ నాయకులు ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీపీఎం పార్టీ ప్రాంతీయ కార్యదర్శి జోగి శివకుమార్ మాట్లాడుతూ ప్రజలకు స్మార్ట్ మీటర్ల వల్ల విద్యుత్ బిల్లులు భారంగా మారుతాయని, అదానికి కోట్లు కూడపెట్టేందుకే స్మార్ట్ మీటర్లు తీసుకొచ్చారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆగస్టు 11వతేదీ స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా చేపట్టే ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. సీపీఎం నాయకులు పుట్టా శంకరయ్య, టి.రామిరెడ్డి, బి.వి.రమణయ్య, ఎంబేటి చంద్రయ్య, అడపాల ప్రసాద్, బి.చంద్రయ్య, చంద్రమోహన్, గండికోట మధు, బాలాజీ పాల్గొన్నారు.

# కల్యాణ వైభవం...!

## మోక్షజ్ఞ - సందీప్



నెల్లూరు వాస్తవ్యులు వీరిశెట్టి ప్రసాద్‌రావు - శుభశ్రీల కుమార్తె **మోక్షజ్ఞ - సందీప్‌కుమార్** (నాయుడుపేట వాస్తవ్యులు బద్రి హరనాథ్ - రాజేశ్వరిల కుమారుడు)ల వివాహం జులై 31వ తేదీ నెల్లూరులో వైభవంగా జరిగింది. కొత్త జంటకు 'లాయర్' శుభదీవెనెలు.

## పృధ్వి - ప్రణతి



నెల్లూరు వాస్తవ్యులు గాదంశెట్టి సుధాకరరావు - లక్ష్మీకుమారిల కుమారుడు **డాక్టర్ వేంకట సాయి పృధ్వి - డాక్టర్ సాయి లక్ష్మీ ప్రణతి** (చీరాల వైకుంఠపురం వాస్తవ్యులు నూనె సూర్యప్రకాష్ - సునీతల కుమార్తెల పరిణయం జులై 30వ తేదీ నెల్లూరులో ఘనంగా జరిగింది. నూతన వధూవరులకు 'లాయర్' శుభాభినందనలు.



## కేంద్ర పెట్రోలియం మంత్రితో.. మన ఎంపీలు

ఇటీవల న్యూఢిల్లీలో కేంద్ర పెట్రోలియం మరియు సహజ వాయువుల మంత్రి హరదీప్‌సింగ్ పూరిని మన నేతలు నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావులు కలుసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ ఎంపీలతో ఆయన్ను కలిసి, రాష్ట్ర సమస్యలపై నివేదిక అందజేశారు.

## ఏపీలో పింఛన్ల పథకం..

# దేశంలోనే రికార్డు!

**- సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి**



ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం చేస్తున్న పింఛన్ల పంపిణీ దేశంలోనే ఒక రికార్డు అని మాజీమంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చెప్పారు. ఇటీవల ఆయన పొదలకూరు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన నూతన స్పౌజ్ పింఛన్ల కార్యక్రమం అనంతరం విలేకర్లతో మాట్లాడారు. నెల్లూరుజిల్లాకు 5429 కొత్తగా స్పౌజ్ పింఛన్లు రాగా, సర్వేపల్లి నియోజకవర్గంలో 720 మందికి మంజూరయ్యాయన్నారు. పింఛన్ల రూపంలో ప్రతినెలా ఒకటోతేదీ మన జిల్లాలో రూ.133.18 కోట్లు పంపిణీ చేస్తున్నామని, ఏడాదికి సుమారు రూ.1600 కోట్లను పింఛన్ల కార్యక్రమానికి ప్రభుత్వం ఖర్చు చేస్తోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.33 వేల కోట్లు పంపిణీ ఇప్పటికే జరుగుతుండగా, కొత్తగా మరో 1.08 పింఛన్లు పెరిగాయన్నారు. ఇంత పెద్దస్థాయిలో పింఛన్లు ఇవ్వడం కూటమి ప్రభుత్వానికే సాధ్యమన్నారు. బీహార్ లో ఇప్పటి వరకు పింఛన్‌గా రూ.400 ఇస్తుండగా, ఇటీవల రూ.1100కి పెంచారని, హైదరాబాద్ వంటి మహానగరం, ఐటీ కంపెనీలు, ఆదాయం ఉన్న తెలంగాణ రాష్ట్రంలోనూ ఇస్తున్న పింఛన్ రూ.2500 మాత్రమేనని తెలిపారు. దేశంలో చాలా రాష్ట్రాలు రూ.1000లోపు మాత్రమే పింఛన్‌గా ఇస్తున్నాయని, మన రాష్ట్రంలో వైసీపీ పాలనలో పింఛన్ ను రూ.2 వేలు నుంచి రూ.3 వేలు పెంచేందుకు ఐదేళ్లు పట్టిందని, అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడగానే ఇచ్చిన మాట ప్రకారం ఒకే సారి పింఛన్‌ను రూ.4వేలకు పెంచిందని వివరించారు. ఆగస్టు 15వ తేదీ నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం సౌకర్యం కల్పించబోతున్నామన్నారు. పీ4 కార్యక్రమంలో భాగంగా సర్వేపల్లి నియోజకవర్గంలో గిరిజన కాలనీలను పలు కంపెనీలు దత్తత తీసుకునే కార్యక్రమం చేపట్టామని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. వెంకటాచలం మండలం చౌటపాళెంలో రూ.360 కోట్లతో ఎన్‌సిఇఆర్‌టీ నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభం కాబోతున్నాయని కూడా ఆయన వివరించారు.

# కాణిపాకం బ్రహ్మోత్సవాలకు భారీ ఏర్పాట్లు



ప్రసిద్ధ విఘ్నేశ్వర క్షేత్రం.. చిత్తూరు జిల్లాలోని కాణిపాకంలో వెలసివున్న శ్రీ వరసిద్ధి వినాయకస్వామివారి ఆలయంలో బ్రహ్మోత్సవాలకు ముమ్మరంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు, ప్రత్యేక ఉత్సవాలు ఆగస్టు 27 నుంచి సెప్టెంబరు 16వ తేదీవరకు 21 రోజుల పాటు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. ఆగస్టు 27న వినాయక చవితి ఉత్సవం, రాత్రికి గ్రామోత్సవం నిర్వహిస్తారు. 28వ తేదీ ఉదయం ధ్వజారోహణం, రాత్రికి హంసవాహనోత్సవం ఉంటాయి. అదేవిధంగా 29న నెమలి వాహనం, 30న మూషిక వాహనం, 31న ఉదయం చిన్న శేషవాహనం, రాత్రికి పెద్ద శేషవాహనం, సెప్టెంబరు 1న ఉదయం చిలుక వాహనం, రాత్రికి వృషభవాహనోత్సవం జరుగుతాయి. 2న గజవాహనం, 3న రథోత్సవం అంగరంగ వైభవంగా ఉంటాయి. 4న ఉదయం భిక్షాండి, రాత్రికి తిరుకల్యాణం, అశ్వవాహనోత్సవం, 5న ధ్వజావరోహణం ఏకాంతసేవలతో బ్రహ్మో త్సవాలు పూర్తవుతాయి. సెప్టెంబరు 6 నుంచి 16వతేదీ వరకు ప్రత్యేక ఉత్సవాలను వైభవోపేతంగా నిర్వహించనున్నారు.

# సీజనల్ వ్యాధులతో జాగ్రత్త!



రాబోయే వర్షాకాలంలో వ్యాధుల పట్ల ముందు జాగ్రత్తలు తీసుకుంటూ అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా మలేరియా, చికెన్‌గున్యా, డెంగ్యూ తదితర వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య పనులు ముమ్మరంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. ఈనెల 4న కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో కీటక జనిత వ్యాధులపై జిల్లా సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, సాంఘిక సంక్షేమ వెనుకబడిన తరగతుల వసతిగృహాల్లో వారంలో ఒకరోజు ప్రత్యేకంగా పరిశుభ్రతకు కేటాయించి పరిసరాలు శుభ్రం చేయాలన్నారు. వసతి గృహాల్లోని చిన్నారులకు జ్వరాలు సంభవిస్తే సంబంధిత జిల్లాస్థాయి అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. జిల్లా మలేరియా అధికారి డాక్టర్ హుస్సేనమ్మ, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

# శ్రీసిటీలో.. 'అక్షరధామ్' ఆధ్యాత్మిక గురువులు



ఢిల్లీలోని ప్రముఖ అక్షరధామ్ స్వామినారాయణ్ ఆలయానికి చెందిన ఆధ్యాత్మిక గురువులు అక్షర్ ప్రేమ్, వినమ్రవదన్‌లు ఇటీవల శ్రీసిటీని సందర్శించారు. వారికి శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి స్వాగతం పలికి, సిటీ ప్రగతి, ప్రత్యేకతలను వివరించారు. ప్రత్యేకించి శ్రీసిటీ పేరుకు ఉన్న ఆధ్యాత్మిక ప్రాధాన్యత గురించి వారికి తెలిపారు. ఈ పర్యటనలో భాగంగా శ్రీసిటీ పారిశ్రామికవాడ పరిసరాలతో పాటు స్థానికంగా ఉన్న శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని, అక్కడ ఏర్పాటు చేసిన శ్రీసిటీ ఉద్యానవనాన్ని స్వామీజీలు సందర్శించారు. అక్కడనుంచి డైకిన్ ఏసీ పరిశ్రమకు వెళ్లి ఆ సంస్థ ప్రతినిధులతో మాట్లాడారు. పచ్చదనం, పర్యావరణం, ఆధ్యాత్మికకు పెద్దవేట వేస్తూ ముందుకు సాగుతున్న శ్రీసిటీ పారిశ్రామిక ప్రగతిని ప్రశంసించిన స్వామీజీలు, శ్రీసిటీ ఎం.డీ డా. రవీంద్ర సన్నారెడ్డిని అభినందిస్తూ ఆశీర్వచనాలు అందచేశారు. ప్రముఖ ఆధ్యాత్మిక, సాంస్కృతిక కేంద్రంగా ప్రపంచ ప్రఖ్యాతి కలిగిన అక్షరధామ్ ఆధ్యాత్మిక గురువులు శ్రీసిటీని సందర్శించడం తమ అదృష్టంగా భావిస్తున్నామంటూ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. ఆ ఆధ్యాత్మిక గురువుల పర్యటనతో ఈ ప్రాంతం మరింత ఆధ్యాత్మిక ప్రాధాన్యతను పొందుతుందన్నారు. దక్షణ భారతదేశంలో శ్రీసిటీ కేంద్రంగా 'స్వామి నారాయణ్' ఆలయ నిర్మాణాన్ని చేపట్టాలని ఈ సందర్భంగా ఆయన వారికి విజ్ఞప్తి చేశారు.



## పేదరికం లేని..
# సమాజ నిర్మాణానికి కృషి చేద్దాం

స్వయం ఉపాధి కల్పన ద్వారా సమాజంలో పేదరికం నిర్మూలించవచ్చని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చెప్పారు. నెల్లూరు నగరం మాగుంట లేఔట్‌లోని ఆమె నివాసంలో ఇటీవల పేదరిక నిర్మూలన ఉద్దేశంగా రూపొందించిన పీ4 పురోగతిపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ నివేదిక ప్రకారం కోవూరు నియోజకవర్గ వ్యాప్తంగా 13,989 బంగారు కుటుంబాలను గుర్తించామన్నారు. సమాజంలోని వివిధ వర్గాలకు చెందిన 878 మంది సంపన్నులు, దాతృత్వ భావాలు కలిగిన రాజకీయ నాయకులు 3,169 కుటుంబాలను దత్తత తీసుకొని వారికి వృత్తిపరమైన నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు ముందుకు వచ్చారన్నారు. సచివాలయ సిబ్బంది, సమాజ సేవ చేయాలనుకునే పారిశ్రామిక వేత్తలతో మార్గదర్శక కమిటీ ఏర్పాటు చేశామన్నారు. పేదరిక నిర్మూలనకు ఉద్దేశించిన పీ4 కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆమె ఈ సందర్భంగా పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో కోవూరు నియోజకవర్గ పరిధిలోని ఎంపీడీవోలు, మార్గదర్శకులు మరియు నియోజకవర్గ యాక్షన్ ప్లాంట్ టీం సభ్యులు పాల్గొన్నారు.

## ఎన్‌బికెఆర్ విద్యార్థులతో..
# 'పునీత్ సాగర్ అభియాన్'
### తూపిలిపాలెం బీచ్‌ని పరిశుభ్రం చేసిన ఎన్‌సిసి క్యాడెట్లు



కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఎన్‌సిసి ఆర్మీ విభాగం క్యాడెట్లు ఇటీవల సమీపంలోని తూపిలిపాలెం బీచ్‌లో పునీత్ సాగర్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పర్యాటకులతో సందడిగా ఉండే ఈ బీచ్‌లో పారేసివున్న ప్లాస్టిక్ బాటిల్స్‌ని, చెత్తాచెదారాన్ని తొలగించి పరిశుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఎన్‌సిసి అధికారి గోవింద మాధవయ్య మాట్లాడుతూ ఎన్‌బికెఆర్ కళాశాలలోని 65 మంది ఆర్మీ ఎన్‌సిసి క్యాడెట్లు సంవత్సరానికి రెండుసార్లు బీచ్‌ని పరిశుభ్రం చేసే కార్యక్రమాన్ని చేపడుతున్నారని, ఇక్కడికి వచ్చే సందర్శకులకు ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలను వివరించి సముద్ర పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు. దుగరాజపట్నం మెరైన్ సబ్‌ఇన్స్పెక్టర్ సౌమ్య ఎన్‌సిసి క్యాడెట్లను అభినందించారు. ఇలాంటి ప్రజోపయోగ కార్యక్రమాలు నిర్వహిస్తూ అందుకు సహాయ సహకారాలు అందిస్తున్న ఎన్‌బికెఆర్ కళాశాల కరస్పాండెంట్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డికి, కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయ్‌కుమార్ రెడ్డికి సందర్శకులు అభినందనలు తెలిపారు.

## ఏపీలో జాతీయ రహదారి
# ప్రాజెక్టుల పురోగతి ఏమిటి?
### - రాజ్యసభలో బీఎంఆర్



ఆంధ్రప్రదేశ్‌లో జాతీయ రహదారి ప్రాజెక్టుల పురోగతికి సంబంధించి రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావుయాదవ్ (బీఎంఆర్) రాజ్యసభలో ఇటీవల పలు ప్రశ్నలు వేశారు. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఆ ప్రశ్నలకు బదులిస్తూ, ప్రస్తుతానికి 1,980 కిలోమీటర్ల పొడవునా రూ. 44,536 కోట్ల వ్యయంతో 96 ప్రాజెక్టులు ఆంధ్రప్రదేశ్‌లో అమలులో ఉన్నాయని తెలిపారు. 2025-26 వార్షిక ప్రణాళికలో రూ. 12,152 కోట్ల అంచనాతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రెండు కొత్త రహదారి ప్రతిపాదనలను కేంద్రానికి సమర్పించగా, ఒకటి రూ.18.09 కోట్ల వ్యయంతో గుడవెల్లి డ్రైన్‌పై చిన్న బ్రిడ్జి నిర్మాణం మంజూరు చేయడం జరిగిందని, మరో ప్రతిపాదన రూ.1,182 కోట్లతో ముద్దనూరు-కడప నాలుగులైన్ల ప్రాజెక్టు పరిశీలనలో ఉందని తెలిపారు. ప్రత్యేకించి శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లాలో 117కిలోమీటర్ల పొడవుతో 6 రహదారి పనులు రూ. 1,599 కోట్ల వ్యయంతో కొనసాగుతున్నాయని మంత్రి తెలిపారు. వీటిలో కృష్ణపట్నం పోర్టుకు ప్రత్యేక రహదారి, కొత్త బ్రిడ్జీలు, ఫ్లైఓవర్లు, బ్లాక్‌స్పాట్ రీడిజైన్ తదితర అంశాలు ఉన్నాయన్నారు. ఈ ప్రాజెక్టులన్నీ నెల్లూరుజిల్లాలో రవాణా మౌలిక సదుపాయాలను మెరుగుపరిచే దిశగా ఎంతో కీలకంగా మారుతున్నాయని, కేంద్ర ప్రభుత్వం వీటి నిర్మాణాన్ని వేగవంతం చేసి గడువులోగా పూర్తి చేయాలని ఈ సందర్భంగా బీఎంఆర్ కేంద్రాన్ని కోరారు.

**బకింగ్‌హామ్ కాలువను పునరుద్ధరించాలి :**

సముద్రతీరం వెంబడి ఉన్న బకింగ్‌హామ్ కాలువను పునరుద్ధరించాలని, ఎప్పుడో బ్రిటిష్‌వారు నిర్మించిన ఈ కాలువ వినియోగం కాలక్రమేణా తగ్గిపోయిందని రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు ఈనెల 4న రాజ్యసభలో ప్రస్తావించారు. ఈ కాలువ వల్ల ఎంతో ఉపయోగం ఉందని, వరదల నుంచి రక్షణ, తాగునీటి వసతితో పాటు, రవాణాకి ఎంతో ప్రయోజనకరమని బీఎంఆర్ తెలిపారు. జాతీయ జలమార్గం-4లో భాగంగా ఈ కాలువ గుర్తింపు పొందినా, దీనిని పునరుద్ధరించే దిశగా చర్యలు చేపట్టడం లేదన్నారు. ఈ కాలువకు ప్రత్యేక ప్రాధికార సంస్థను ఏర్పాటుచేసి, నిధులు మంజూరుచేసి కాలువ పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

# ఆదిశంకర ధ్యానమందిరంలో.. ప్రత్యేక పూజలు



నెల్లూరులోని ఆదిశంకర ధ్యాన మందిరంలో మేనేజింగ్ ట్రస్టీ చక్రాల ఆనందకుమార్, మందిర కమిటీ అధ్యక్షుడు గుండాపంతుల రామసుబ్రహ్మణ్యశర్మ పర్యవేక్షణలో ఇటీవల సువాసిని అమ్మవారికి ప్రత్యేకపూజలు చేశారు. సామూహిక లలిత సహస్ర నామార్చన కుంకుమ పూజలు నిర్వహించారు. మహిళా భక్తమండలి వారు వీనులవిందుగా లలిత పారాయణం, కనువిందుగా కుంకుమార్చన, సువాసినీపూజలు చేశారు. మందిరం మేనేజర్ స్వామి సమయానందనాథ పర్యవేక్షించారు. మల్లవరపు లక్ష్మీనరసింహారావు భక్తి శ్లోకాలు పాడి, అష్టాదశ గీతా శ్లోకీ పారాయణ చేసి, పూజకు ముందు మహిళామూర్తులచే సంకల్పం చెప్పించారు. కమిటీ అధ్యక్షులు గుండాపంతుల వెంకటసుబ్రహ్మణ్యశర్మ సువాసిని పూజా విధానం, లలితా సహస్రనామ స్తోత్రం విశేషాలను వివరించారు. ట్రస్ట్ ధర్మకర్తలు పివి ప్రసాద్ వంకా శ్రీహరి ప్రసాదరావు, గన్నవరం ప్రభాకరరావు, తూములూరు వెంకటేశ్వరశర్మ తదితరులు పాల్గొన్నారు. చక్రాల వెంకట లక్ష్మీనరసింహం మాట్లాడుతూ, ఈనెల 12న శ్రావణ బహుళ తదియ రోజున ఆదిశంకర ధ్యాన మందిరం వార్షికోత్సవం సందర్భంగా, ఆ సాయంత్రం నెల్లూరు రామకృష్ణమిషన్ వారిచే సత్సంగం నిర్వహిస్తామని తెలిపారు.

# శ్రీసిటీలో మరిన్ని మౌలిక సదుపాయాలు
### 45 కోట్లతో జంక్షన్ నిర్మాణాలకి గ్రీన్‌సిగ్నల్

పారిశ్రామిక రవాణా సదుపాయాలను మెరుగుపరిచే చర్యల్లో భాగంగా జాతీయ రహదారి-16 (ఎన్‌హెచ్-16) లోని శ్రీసిటీ ముఖద్వారం (ఎంట్రీ పాయింట్) వద్ద దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న మౌలిక వసతుల అభివృద్ధి పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి. ఆ మేరకు ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా వివిధ జాతీయ రహదారి ప్రాజెక్టు పనులకు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబునాయుడు వర్చువల్‌గా పునాది వేశారు. వీటిలో ఫ్లైఓవర్లు, బైపాస్‌లు, రోడ్డు విస్తరణ మరియు ఓవర్‌బ్రిడ్జిల నిర్మాణం ఉన్నాయి. ఇవన్నీ ఆంధ్రప్రదేశ్‌ను లాజిస్టిక్స్ మరియు పారిశ్రామిక శక్తి కేంద్రంగా మార్చడం లక్ష్యంగా ఏర్పాటుకానున్నాయి. ముఖ్యంగా శ్రీసిటీ ఎంట్రీ పాయింట్ వద్ద కీలక మౌలిక సదుపాయాల ప్రాజెక్టులో రూ.45 కోట్ల పెట్టుబడితో 900 మీటర్ల గ్రేడ్-సెపరేటెడ్ జంక్షన్ నిర్మించనున్నారు. ఇది ఎన్‌హెచ్-16పై ఎలాంటి అంతరాయం లేకుండా ట్రాఫిక్‌రద్దీని కొనసాగిస్తోంది. తద్వారా, శ్రీసిటీలోకి ప్రవేశించే, శ్రీసిటీ నుంచి వెళ్ళే వాహనాలకు ప్రత్యేక అండర్‌పాస్ సదుపాయం కలుగుతుంది. ఇష్టారాజ్యంగా లింక్ రోడ్ల ద్వారా జాతీయ రహదారిపై ప్రవేశించడం, రోడ్డుపై వాహనాలను ఆపడం వంటి సమస్యలకు 'చెక్' పెడుతుంది. ఈ ప్రాజెక్ట్ పూర్తయిన అనంతరం శ్రీసిటీ, చెన్నై, నెల్లూరు, కృష్ణపట్నం పోర్టు వంటి కీలక గమ్యస్థానాల మధ్య అనుసంధానాన్ని బాగా పెంచుతుంది. కార్గో ట్రక్కులు, కార్మికుల రవాణా బస్సులకు ఏర్పడే జాప్యాలను తగ్గించడంలో సహాయపడుతుంది. ఈ అభివృద్ధిని స్వాగతించిన శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, 'ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న ఈ ప్రాజెక్ట్ కార్యరూపం దాల్చినందుకు సంతోషంగా ఉందని, ఇది కార్గో ఇతర వాహన రవాణాను చాలా సులభతరం చేస్తుందని సంతృప్తి వ్యక్తం చేశారు. ఇది పరిశ్రమలకు, ఉద్యోగులకు అత్యంత ప్రయోజనాన్ని చేకూరుస్తుందని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, కేంద్రమంత్రి నితిన్ గడ్కరీల ఆధ్వర్యంలో రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధిలో ఇదొక ప్రధానమైన ముందడుగని అన్నారు.

## టూకీగా...



### బోగోలులో రేషన్ దుకాణాల తనిఖీ

బోగోలు మండలంలోని పలు రేషన్ దుకాణాలను ఈ నెల 4న సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహశీల్దార్ ఎం.విజయమ్మ ఆకస్మికంగా తనిఖీ చేసి, వాటి పనితీరును ఆరా తీశారు. సక్రమంగా ప్రజలకు సరుకులు అందజేస్తున్నారా లేదా అని పరిశీలించారు. లబ్ధిదారుల అభిప్రాయాలను అడిగి తెలుసుకుని, దుకాణదారులకు తగు సూచనలిచ్చారు.

### జలదంకిలో ఎరువుల డీలర్లతో సమావేశం

మండల కేంద్రమైన జలదంకి వ్యవసాయశాఖ కార్యాలయంలో ఈనెల 4న అధికారులు ఎరువులు, పురుగుమందుల డీలర్లతో సమావేశం నిర్వహించారు. యూరియాను అధికధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని డీలర్లను హెచ్చరించారు. వింజమూరు వ్యవసాయ సహాయసంచాలకులు ఎం.శేషగిరి, మండల వ్యవసాయాధికారిణి శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

### ఉదయగిరిలో స్కానింగ్ సెంటర్ల పరిశీలన

ఉదయగిరి నియోజకవర్గంలోని పలు ప్రైవేటు ఆసుపత్రుల్లో స్కానింగ్‌లపై పీసీపీఎన్‌డీటీ అధికారులు ఈనెల 4న తనిఖీలు చేపట్టారు. స్కానింగ్‌ల వివరాలను పరిశీలించారు. లింగనిర్ధారణ చేస్తే కఠిన చర్యలు తప్పవని సంబంధిత సిబ్బందిని హెచ్చరించారు.

### కోవూరులో చికెన్ వ్యర్థాల వాహనం పట్టివేత

చికెన్ వ్యర్థాలను నింపుకుని చెన్నై నుంచి వస్తున్న ఓ వాహనాన్ని ఈనెల 4న కోవూరు పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ రంగనాథగౌడ్ ఆధ్వర్యంలో పోలీసులు ఆ వాహనాన్ని సీజ్‌చేసి, ఆ వాహనంలో చికెన్ వ్యర్థాలను తీసుకువస్తున్న వారిపై కేసులు నమోదు చేశారు.

### యల్లాయపాలెం విద్యార్థులకు సైకిళ్ళు

కొడవలూరు మండలం యల్లాయపాలెంలోని జడ్పీ హైస్కూలులో చదువుకుంటున్న పలువురు బాలికలకు పూర్వ విద్యార్థుల సహకారంతో ఈనెల 4న సైకిళ్ళను బహుకరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మోహన రామలింగయ్య, పూర్వ విద్యార్థి కట్టా ప్రభాకర్‌రెడ్డి, షేక్ మాబు, బాలికల తల్లితండ్రులు పాల్గొన్నారు.

### మాచర్లవారిపాలెంలో తల్లిపాల వారోత్సవాలు

జిల్లాలో జరుగుతున్న తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా ఈనెల 4న తోటపల్లి గూడూరు మండలం మాచర్లవారిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు, తల్లులకు తల్లిపాల పట్ల అవగాహన కల్పించారు. పుట్టిన బిడ్డకు తల్లిపాలే అమృతమని, పుట్టిన గంటలోపలే తల్లిపాలు తాగించాలని, ఆరునెలల వరకు తల్లిపాలే బిడ్డకు ఇవ్వాలని వారికి సూచించారు.

### గుండుపల్లిలో జడ్పీ సీఇఓ పర్యటన

సీతారామపురం మండలం గుండుపల్లి ఎస్‌సీ కాలనీలో జడ్పీ సీఇఓ మోహన్‌రావు ఈనెల1న ఆకస్మికంగా పర్యటించారు. పారిశుద్ధ్యం పరిస్థితిపై, మౌలిక సదుపాయాల కల్పనపై ఆరాతీశారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పంచాయతీ సిబ్బందికి తగు సూచనలిచ్చారు. ఎంపీడీఓ సాయిప్రసాద్, రామనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### రేబాలలో క్షయవ్యాధిపై అవగాహన

బుచ్చిరెడ్డిపాలెం మండలంలోని రేబాలలో ఉన్న క్షయవ్యాధి కేంద్రాలను వైద్యాధికారి డాక్టర్ ఖాదర్‌వలీ ఇటీవల సందర్శించారు. సిబ్బందితో మాట్లాడుతూ, క్షయవ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం మందులు ఉచితంగా అందిస్తోందన్నారు. వైద్యుల సలహాలు పాటిస్తే క్షయవ్యాధి నుండి రోగులు త్వరగా కోలుకోవచ్చని తెలిపారు. డాక్టర్ వినయ్‌కుమార్, సుబ్బారెడ్డి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

### సైదాపురంలో పురుగుమందుల దుకాణాల్లో తనిఖీలు

మండల కేంద్రమైన సైదాపురంలోని పలు పురుగుమందుల దుకాణాల్లో మండల వ్యవసాయ అధికారిణి హైమావతి ఇటీవల ఆకస్మిక తనిఖీలు చేశారు. ఎంఆర్‌పీ ధరలను, రికార్డులను పరిశీలించారు. అధికధరలకు పురుగుమందులను అమ్మితే కఠినచర్యలు తప్పవని దుకాణ యజమానులను హెచ్చరించారు.

# చేనేత రంగాన్ని కాపాడుకోవాలి

- జాతీయ చేనేత దినోత్సవంలో జేసీ కార్తీక్



భారతదేశ సాంస్కృతిక వారసత్వ సంపద అయిన చేనేతని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని, ప్రతిఒక్కరూ చేనేత వస్త్రాలను విరివిగా ధరించి చేనేత కళాకారులను ప్రోత్సహించాలని జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ పిలుపునిచ్చారు. ఈనెల 7వ తేదీ గురువారం జిల్లా చేనేత జౌళిశాఖ ఆధ్వర్యంలో జాతీయ చేనేత దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత, నగరంలోని గాంధీ బొమ్మ వద్ద మహాత్మాగాంధీ విగ్రహానికి జాయింట్ కలెక్టర్ పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం చేనేత కార్మికుల ర్యాలీని జేసీ జెండా ఊపి ప్రారంభించారు. జాతిపిత మహాత్మాగాంధీ భారత స్వాతంత్ర్య ఉద్యమంలో చేనేత వస్త్రపరిశ్రమల అభివృద్ధికి ఎంతో కృషిచేశారని, స్వదేశీ ఉద్యమంలో భాగంగా ఖాదీని ఉపయోగించి, స్వయం సమృద్ధిని, స్వయం విశ్వాసాన్ని పెంపొందించడానికి ఆ మహనీయుడు చేసిన కృషి ఎంతో విలువైనదని అన్నారు. సింథటిక్ వస్త్రాల కంటే చేనేత వస్త్రాలతోనే ఆరోగ్య ప్రయోజనాలున్నాయని చెప్పారు. చేనేత జౌళిశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ సుధాకర్, చేనేత కార్మిక సంఘాల నాయకులు బుధవారపు బాలాజీ, కడిమి వెంకటశేషయ్య, సజ్జా వెంకటసురేష్, పముజుల శంకరయ్య, సోమా గోపాల్, కోటేశ్వరరావు, సోమా అనూరాధ, చేనేత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## 'అవ్వారు'కి..'ఎక్స్‌రే అవార్డు'



నెల్లూరుకి చెందిన ప్రముఖ కవి, పెన్నా రచయితల సంఘం (పెరసం) గౌరవాధ్యక్షులు, ఇప్పటికే పలు సాహితీ అవార్డులందు కున్న అవ్వారు శ్రీధర్‌బాబుకు తాజాగా 'ఎక్స్‌రే అవార్డు' కూడా లభించింది. ఇటీవల జరిగిన 44వ జాతీయస్థాయి ఎక్స్‌రే పోటీల్లో ఆయన రచించిన 'కదలాల్సిన అవసరం' అనే కవితకి అవార్డు రావడం పట్ల స్థానిక సాహిత్యాభిమానులు సంతోషం వ్యక్తం చేశారు. 2021, 2021 సంవత్సరాల్లో కూడా ఎక్స్‌రే వారు నిర్వహించిన కవితల పోటీల్లో అవ్వారు కవితలు ఉత్తమంగా నిలిచి బహుమతు లందుకున్నాయి. మొత్తంగా 3సార్లు ఆయన ఎక్స్‌రే పత్రిక అవార్డులు అందుకోవడం విశేషం. అదేవిధంగా, నెల్లూరుకు చెందిన కవి దుప్పటి రమేష్‌బాబుకు కూడా ఈసారి తొలిసారిగా ఆ అవార్డు లభించింది.

## డీఐఈఓగా కృష్ణారెడ్డి



జిల్లా ఇంటర్‌బోర్డు విద్యాశాఖ ఇన్‌చార్జి(డీఐఈఓ)గా గుంటూరుజిల్లా పిడుగురాళ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న బీవీ కృష్ణారెడ్డి నియమితులయ్యారు. నెల్లూరులోని కేఏసీ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఉన్న డీఐఈఓ కార్యాలయంలో ఈనెల 4న ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన్ను పలువురు అధ్యాపకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

## వేడుకగా..శబరి శ్రీరామక్షేత్రం వార్షికోత్సవాలు



నెల్లూరు దర్గామిట్టలో కొలువైవున్న శబరి శ్రీరామక్షేత్రం 25వ వార్షికోత్సవ వేడుకలు ఈనెల 7న వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం స్వామివార్లకు లక్ష తులసీదళ అర్చన, రాత్రి శ్రీ సీతారామ కల్యాణం వైభవోపేతంగా నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. 8వ తేదీ శుక్రవారం ఉదయం 8.30గంటలకు సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.



## గోవా గవర్నర్‌ను సన్మానించిన ఎంపీ వేమిరెడ్డి

గోవా గవర్నర్‌గా నియమితులైన మాజీ టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ కేంద్రమంత్రి అశోక్ గజపతిరాజును నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సన్మానించారు. ఇటీవల ఢిల్లీ విమానాశ్రయంలో అశోక్ గజపతిరాజు దంపతులను కలిసిన ఎంపీ వేమిరెడ్డి, వారికి శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సన్మానించారు. అశోక్ గజపతిరాజు గోవా గవర్నర్‌గా నియమితులు కావడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ, వారు దేశానికి మరిన్ని సేవలు అందించాలని ఎంపీ వేమిరెడ్డి ఆకాంక్షించారు.

## కందుకూరుకి..కొత్త సబ్ కలెక్టర్



నెల్లూరుజిల్లా కందుకూరుకు కొత్త సబ్ కలెక్టర్‌గా దామెర హిమవంశీ నియమితులయ్యారు. ఆమేరకు ఈనెల 4న రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ నుంచి ఉత్తర్వులు వచ్చాయి. ఈ స్థానంలో ఇప్పటివరకు పనిచేసిన టి.శ్రీపూజను ఇక్కడినుంచి బదిలీ చేశారు. 2023 ఐఏఎస్ బ్యాచ్‌కి చెందిన హిమవంశీ తెలంగాణలోని నల్గొండ నివాసి. 2022 బ్యాచ్ ఐఏఎస్‌కి చెందిన అధికారిగా ఎంపికయ్యారు. రూర్కి ఐఐటిలో జియోఫిజకల్ సైన్స్‌లో ఆయన ఇంజనీరింగ్ పూర్తిచేశారని, ఆ తర్వాత సివిల్స్ రాశారని సమాచారం. తొలి పోస్టింగ్‌లోనే ఆయన కందుకూరు సబ్‌కలెక్టర్‌గా నియమితులు కావడం విశేషం. కందుకూరు నియోజకవర్గంలోని కరేడులో భూసేకరణ ప్రక్రియ వివాదాస్పదం కావడం, రామాయపట్నం పోర్టు అనుబంధ పరిశ్రమలకు సంబంధించిన భూసేకరణపై రైతుల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతుండడం, ఈ నేపథ్యంలో సబ్ కలెక్టర్‌గా ఉన్న శ్రీపూజ బదిలీకావడం స్థానికుల్లో చర్చనీయాంశంగా మారింది. బదిలీచేశాక, ఎక్కడా పోస్టింగ్ ఇవ్వకపోవడం కూడా చర్చగా ఉంది.

- ఆగస్టు 8 వరలక్ష్మీ వ్రతం
- 9వ తేదీ రాఖీ పండుగ
- 15న జెండా పండుగ
- 16న శ్రీకృష్ణ జన్మాష్టమి
- 27 నుంచి వినాయకచవితి

*అదిగో రాఖీ పండుగ వచ్చేసింది. ఒక్క రాఖీయే కాదు..ఆగస్టు నెల 8 నుంచి ఒకదాని వెంట మరొకటిగా పండుగలు వచ్చేస్తున్నాయి. ఆనందాలన్నీ మన ఇళ్ళకి తెచ్చేస్తున్నాయి. అసలే ఇది శ్రావణమాసం. అమ్మవారి దేవాలయాలన్నీ కళకళలాడుతుంటే, మరోవైపు ఈనెల 8న శ్రావణ శుక్రవారంతో పాటు..అదే రోజున ఎంతో ముఖ్యమైన పండుగ..వరలక్ష్మీ వ్రతం వచ్చేసింది. పూజలు, వ్రతాలతో అందరి ఇళ్ళల్లో లక్ష్మీకళ తాండవిస్తోంది. ఆ సంబరంలో ఉండగానే, అన్నాచెల్లెళ్ళ అనురాగ దీప్తిలా.. 9న రాఖీ పండుగ వచ్చేస్తుంది. వారం తిరిగే సరికల్లా ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం కనుక, జెండాపండుగ, ఆ పక్కరోజు 16 నుంచి శ్రీకృష్ణాష్టమి వేడుకలతో ఇంటింటా పండుగ సందడే. కొద్దిరోజులు కాగానే ఈనెలలోనే వినాయకచవితి సంబరం చెప్పలేనంత. వినాయకచవితి ఆగస్టు 27 నుంచే అయినా, ఇప్పటినుంచే చవితి వేడుకలకు వీధివీధిలో కోలాహలం కనిపిస్తోంది. ఒక్క మాటల్లో చెప్పాలంటే... ఇది పండుగల వారమనో లేదా పండుగల మాసమనో చెప్పవచ్చు.*

# అన్నా చెల్లెళ్ళ..అనురాగ బంధం..రాఖీ!



రాఖీ పండుగ అంటేనే.. ఏదో తెలియని ఆత్మీయత అందరిలోనూ కనిపిస్తుంది. ముఖ్యంగా అన్నాచెల్లెళ్ళ అనురాగ బంధానికి ఇదో ప్రతీక. అందుకే ప్రతి ఏటా రాఖీ పండుగ అంటేనే అన్నా చెల్లెళ్లలో మరింత ఆత్మీయతానురాగాలు వెల్లివిరుస్తుంటాయి. ఎక్కడో దూరాన చెల్లెలు, అన్నా ఉన్నప్పటికీ రాఖీ వారిద్దరినీ ఏదో ఒక విధంగా దగ్గర చేస్తుంది. చెల్లెలు ఎక్కడ ఉన్నా అన్నకి రాఖీ పంపడం, అక్క ఎంత దూరాన ఉన్నా తమ్ముడు వెళ్ళి రాఖీ కట్టడం చూస్తూనే ఉంటాయి. ఇద్దరూ ఒకరికొకరు రాఖీలు కట్టుకుని ఆనందించడం కూడా జరుగుతూ ఉంటుంది. నేటి ఆధునిక కాలంలో బంధాలు అనుబంధాలన్నీ కనుమరుగుతున్న దశలో.. ఇలాంటి పండుగలు ఆ ఆత్మీయతాను బంధాలు మన మనసుల్లోంచి వేరు కాకుండా 'రాఖీ' అనే దారంతో కట్టివేస్తుంటాయి. నిరాశలో ఉన్నప్పుడు నేనున్నానంటూ ధైర్యం చెప్పే ఒక అన్నా లేదా తమ్ముడు ఉంటే, ఆ అక్కకి లేదా చెల్లెలకి ఎంత ధీమాగా ఉంటుందో తెలుసా!.. ఆకాశాన్నెక్కినంత సంబరంగా ఉంటుంది. అందుకే తనకో అన్నో లేదో తమ్ముడో ఉండాలని అమ్మాయిలంతా కోరుకుంటారు. అంతులేని ఈ జీవిత పయనంలో ఒకరికొకరి భరోసా ఏదైనా ఉందంటే, అదే సోదరుల అండ..అదే రక్షదారంగా మారి వారికో మంచిదారి చూపుతుంది.

### రాఖీ అంటే రక్ష దారమే :

రాఖీ అంటే కేవలం ఏదో పట్టీయో..రంగు రంగుల దారమో కాదు. అక్కాతమ్ముళ్ళు, లేదా అన్నా చెల్లెళ్ళు జీవితాంతం ఒకరికొకరు అండగా ఉండేందుకు చేసుకునే సంకల్పం.. అదే రక్షాబంధనం. అదొక రక్షాదారం. ఆ మమతానుబంధానికి కట్టుబడి ఉండడమే ఈ పండుగ ధ్యేయం. రాఖీ పండుగ అని, రక్షా బంధన్ లేదా రాఖీ పౌర్ణమి అని పిలిచే ఈ పండుగను కొన్ని ప్రాంతాలలో శ్రావణ పౌర్ణమి అని కూడా పిలుస్తారు. అన్నాచెల్లెళ్లు లేదా అక్కాతమ్ముళ్ల ప్రేమానురాగాలకు సూచకంగా ఈ పండుగను జరుపుకుంటారు. తన అన్నయ్య లేదా తమ్ముడు సమాజంలో ఉన్నత శిఖరాలకు ఎదగాలని చెల్లి అయినా, అక్కయినా మనసారా కోరుకుంటుంది. అదే విధంగా తన చెల్లి కూడా ఎలాంటి కష్టాలు లేకుండా హాయిగా జీవించాలని అన్న, లేదా తమ్ముడు కోరుకుంటారు. ఇంత పవిత్రమైన ఆలోచనలతో జరుపుకునే పండుగ కనుకనే, రాఖీ పండుగకు ఇంత ప్రఖ్యాతి వచ్చింది.

### మార్కెట్లలో.. కోకొల్లలుగా రాఖీలు

రానురాను రాఖీ పండుగ ఒక పెద్ద వ్యాపారంగా కూడా మారింది. మార్కెట్లో ఎక్కడ చూసినా రకరకాలు, రంగుల రంగుల రాఖీలు మనసును ఇట్టే ఆకట్టుకుంటాయి. ఒకదానికొకటి మిన్నగా ఉంటూ రాఖీలు ఈ పండుగ రోజుల్లో అందరినీ అలరిస్తుంటాయి. తక్కువగా 5 రూపాయల నుంచి.. ఎంత మొత్తంలోనైనా సరే అద్భుతమైన రాఖీలు లభిస్తున్నాయి. అయినా.. రాఖీలు ఎంత గొప్పవన్నది కాదు ముఖ్యం..రాఖీని కట్టిన తమ సోదరికి ఆజన్మాంతం రక్షణ ఇస్తేనే రాఖీ పండుగకు సార్థకత!...

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3.
Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com